# ప్రజాశక్తి

ఆదివారం 12 మే 2024 | 12 పేజీలు




ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

## ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- పోలింగ్ కేంద్రాలకు అక్రిడేటెడ్ జర్నలిస్టుల అనుమతి
- జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి

8లో



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీ సురేష్

## ఎంపీ సురేష్‌పై దాడి

3లో

## పోలీస్‌స్టేషన్‌లో టిడిపి కార్యకర్తపై వైసిపి నేత దాడి

3లో



## ప్రజల భూములను దోచుకునేందుకే ..

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులు దహనం

8లో

# ప్రచారం సమాప్తం

- గెలుపు కోసం ఇంటింటికీ తిరిగిన అభ్యర్థులు
- చంద్రబాబు మూడు సార్లు.. జగన్ మూడు సార్లు రాక
- ఇండియా వేదిక అభ్యర్థులూ వామపక్షాలతో కలిసి ప్రచారం

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

ఎన్నికల సమరం ప్రచారం ముగిసింది. శనివారం సాయంత్రంతో ప్రచార సమయం సమాప్తమైంది. మైకులు ఆగిపోయాయి. పార్టీల మేనిఫెస్టోలు..ఇతర హామీలపై గాయకులతో పాడించిన పాటలు గ్రామాల్లో ఉర్రూతలూపించాయి. ఇప్పుడు అవన్నీ ఆగిపోయాయి. అంతా నిశ్శబ్దమే. ఇక అసలు సమరమే మిగిలింది. పోలింగుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. సర్వసన్నద్ధమైంది. ఇక అభ్యర్థులు ఇప్పటికే కొందరు పంపిణీలు పూర్తిచేసుకోగా.. కొందరు మొదలుపెట్టారు. ఈ రెండు రోజులూ ఇదే కీలకం. అభ్యర్థులు గెలుపు కోసం గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఊరూవాడా తిరిగారు. ఇంటింటికీ వెళ్లారు. గెలిస్తే ఏం చేస్తారో చెప్పారు. కరపత్రాలు అందించారు. వైసిపి, తెలుగుదేశం, ఇండియా వేదిక తరపున వామపక్షాల మద్దతుతో పోటీచేస్తున్న కాంగ్రెసు అభ్యర్థులూ ప్రచారంలో 2లో



మహిళలతో మాట్లాడుతున్న టిడిపి అద్దంకి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్



దర్శి వైసిపి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న వ్యక్తులు

# 'కూటమి' అభ్యర్థులను గెలిపించండి..

- మాగుంట, దామచర్ల పిలుపు
- ఘన స్వాగతం పలికిన వ్యాపారులు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

రానున్న ఎన్నికలలో టిడిపి-బిజెపి-జనసేన కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం ఒంగోలు గాంధీ రోడ్డులో కూటమి అభ్యర్థులు చేపట్టిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. డప్పులు, తీన్ మార్ డ్యాన్సులు, టిడిపి-బిజెపి-జనసేన జెండాలతో రోడ్‌షో మొత్తం ఉత్సాహంగా సాగింది. గాంధీ రోడ్డులోని వ్యాపారులు టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావుపై పూల వర్షం కురిపించారు. మాగుంట, దామచర్లకు పూలమాలలు వేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నికల ప్రచార రథంపై నిలబడిన 2లో



రోడ్‌షోలో పాల్గొన్న మాగుంట, దామచర్ల

# కాంగ్రెస్ గెలుపు..అభివృద్ధికి మలుపు

- సంతనూతలపాడు అభ్యర్థి పాలపర్తి విజేష్‌రాజ్

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

కాంగ్రెస్ పార్టీ గెలుపు అభివృద్ధికి మలుపు అని కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి పాలపర్తి విజేష్‌రాజ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాడు నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో వామపక్షాల నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేష్‌రాజ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆదరించాలని కోరారు. స్థానికంగా అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కషిచేస్తానన్నారు. గత పాలకవర్గాలు గత ఐదు, పది సంవత్సరాల కాలంలో నియోజకవర్గ అభివద్ధిని నిర్లక్ష్యం చేశాయన్నారు. కనీసం గుండ్లకమ్మ గేట్లు మరమ్మతులు చేపట్టలేని పరిస్థితి నెలకొన్న వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కారణంగా రైతాంగం నష్టపోయారన్నారు. దాంతో పాటు ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో గుండ్లకమ్మకు వచ్చిన వరదనీరు అంతా సముద్రం పాలవడంతో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గుళ్ళాపల్లి 2లో



ప్రచారంలో వామపక్ష నేతలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాలపర్తి విజేష్‌రాజ్

## ప్రచారం సమాప్తం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అందరూ గెలుపు కోసం అన్ని వర్గాలనూ కలిసే యత్నం చేశారు. ముందుగానే ఖరారైన అభ్యర్థులు అన్ని గ్రామాలూ తిరిగారు. సభలు పెట్టారు. చెప్పాల్సింది చెప్పారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం అన్ని అడ్డ దారులూ తొక్కుతున్నారు. చేతిలో రూ.నోట్లు పెడుతున్నారు. బియ్యం బస్తాలూ ఇస్తున్నారు. ఓటు కోసం నానాపాట్లు పడుతున్నారు. వైసిపి నుంచి ప్రభుత్వ పథకాలు అక్కరకు వచ్చినట్లు కనిపించడం లేదు. నవరత్నాలు ఓట్లు కురిపిస్తాయనే నమ్మకం, ధీమా లేనందున నోట్లు భారీగా పంచుతున్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం అభ్యర్థులూ నోట్లు పంచుతున్నారు. ఇద్దరూ పోటాపోటీగానే ఇస్తున్నారు. ప్రచారం ముగియకుండానే పంపిణీలు ముగించారు కొందరు. ఒంగోలులో రూ.3 వేలు ఒకరిస్తే రూ.2 వేలు మరొకరు ఇచ్చారు. దర్శిలోనూ రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక్కడా పోటీ పడి ఓటర్లకు డబ్బులు పంచుతున్నారు. పశ్చిమాన కొందరు రూ.2 వేలు ఇస్తుంటే కొందరు రూ.1500 ఇస్తున్నారు. ఏదేమైనా అందరూ ఇవ్వడం అనివార్యమైంది. డబ్బులు ఇవ్వకపోతే ఓట్లు రావని తేలిపోయింది. ఇండియా వేదిక తరపున పోటీచేసిన అభ్యర్థులు ఎక్కడా నోట్లు పంచే పరిస్థితి లేదు. కేంద్రంలోని బిజెపి ప్రమాదాన్ని వివరిస్తూ జనంలో ప్రచారం చేపట్టారు. వామపక్షాల నేతలు, పార్టీ శ్రేణులు కాంగ్రెసు అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. సీనియర్ అభ్యర్థులు ప్రచారాన్ని ప్రతిష్టాత్మకంగానే తీసుకున్నారు. తెలుగుదేశం నుంచి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, డోలా వీరాంజనేయస్వామి, ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌తో పాటు మిగతా అభ్యర్థులు ప్రచారంలో ముమ్మరంగా ఉన్నారు. నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారాలు నిర్వహించారు. వైసిపి నుంచీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి బాలినేని, మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, అన్నా రాంబాబు తదితర సీనియర్ నేతలు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. ఇక రాష్ట్ర నేతలూ పర్యటించారు. సిఎం వైఎస్ జగన్ కందుకూరు, కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో బస్సుయాత్ర నిర్వహించారు. తర్వాత టంగుటూరు, కనిగిరిలో బహిరంగసభల్లో పాల్గొన్నారు. చంద్రబాబు మార్కాపురం, దర్శి, ఒంగోలులో రోడ్‌షోలు, బహిరంగ సభ నిర్వహించారు. తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారాలు నిర్వహించారు. రాజకీయంగా ఆరోపణలు, పార్టీల మేనిఫెస్టోల గురించి ప్రసంగాల్లో ప్రధానంగా ప్రజలకు వినిపించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వస్తారని భావించినా ఆయన పర్యటన లేకుండా పోయింది. కాంగ్రెసు అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆ ఎర్టీ అభ్యర్థుల విజయం కోసం జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. బిజెపి విధానాలపైనా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్ జగన్ విధానాలు, పాలనపైనా షర్మిల ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సుధాకర్‌రెడ్డి పోటీలో ఉండగా అన్ని అసెంబ్లీ స్థానాలకు పోటీచేసిన అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. ఇక ఆఖరు రోజున అభ్యర్థులు రోడ్‌షోలు, ర్యాలీలు, సభలు నిర్వహించారు.

## 'కూటమి' అభ్యర్థులను గెలిపించండి..

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. గాంధీ రోడ్డులో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని జయప్రదం చేసిన టిడిపి-బిజెపి-జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒంగోలు ఎంపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యానం చిన్న యోగయ్య యాదవ్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడు నిఖిల్ రెడ్డి, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, వై.శశికాంత్ భూషణ్, అయినాబత్తిన ఘనశ్యామ్, తాతా ప్రసాద్, పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి, బెల్లం సత్యనారాయణ, కొఠారి నాగేశ్వరరావు, దాయనేని ధర్మ, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఏలూరి కోటేశ్వరరావు, టిడిపి-బిజెపి-జనసేన పార్టీల డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రచారం

## మెజార్టీ ఓటర్లు ఎటువైపు...?

**ప్రజాశక్తి-మార్కాపురం**

మార్కాపురం నియోజకవర్గంలో పోటీలో 29 మంది నిలిచినా.... పోటీ ద్విముఖమే...! వైసిపి-టిడిపిల మధ్య పోరు జరుగుతోంది. ఆ రెండు పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహించాయి. శనివారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. ఇక మిగిలింది ఓటరు నిర్ణయమే. మెజార్టీ ఓటర్లు ఎటువైపు అనేది చర్చ సాగుతోంది.



అన్నా వెంకట రాంబాబు (వైసిపి)



కందుల నారాయణరెడ్డి (టిడిపి)

మార్కాపురం నియోజకవర్గంలో వైసిపి బలం ఎక్కువనే చెప్పాలి. ఆ తరువాత స్థానంలో టిడిపి ఉంది. ప్రధాన పార్టీల తరపున అత్యధిక సార్లు జరిగిన ఎన్నికల్లో రెడ్డి సామాజికవర్గం నుంచి ఇరు పార్టీల తరపున పోటీలో నిలుస్తున్నారు. ఈ దఫా వైసిపి మాత్రం ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించింది. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబును మార్కాపురం బరిలో నిలిపింది వైసిపి అధిష్టానం. టిడిపి మాత్రం ఆ పార్టీలో పాత కాపుగా ఉన్న కందుల నారాయణరెడ్డిని బరిలో దింపింది. వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు సౌమ్యుడుగా పేరు గడించారు. సాయం చేయడంలో ఆయన తరువాతనే అని చెప్పాలి. రాజకీయాల్లోకి రాక మునుపే సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేద విద్యార్థులను విద్యాధికులుగా తీర్చిదిద్దారు. కరవు సమయంలో తాగునీటి ట్యాంకర్లు నడిపారు. పెళ్లిళ్లు, పేరంటాలు, ఆపద సమయాల్లో ఆర్థికంగా ఆదుకుంటారనే పేరుంది. మంచి పేరుతో పాటు వైసిపి బలంగా ఉండటంతో గెలుపు నల్లేరు మీద నడకనని ఆ పార్టీ భావిస్తోంది. వీటన్నింటితో పాటు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం వంటి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లింది. సంక్షేమం అందించడంలో వివక్ష లేకుండా జరిగింది. అట్టడుగు వర్గాల్లో వైసిపికి ఆదరణ ఉందని, భారీ మెజార్టీ రావచ్చునే ఆలోచనలో వైసిపి నేతలు ధీమాగా ఉన్నారు.

టిడిపి అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి 2004 నుంచి పోటీ చేస్తూనే ఉన్నారు. 2009లో మినహా మిగిలిన అన్నిసార్లు ఓటమి పాలయ్యారు. ఆ పార్టీ బలం కూడా ఇక్కడ తక్కువనే చెప్పాలి. కందుల నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత స్వలాభం కోసం పనిచేశారనే అపవాదు ఉంది. ఆయన అనుచరుల్లో నేటికీ దుడుకుతనం తగ్గలేదు. టిడిపి ప్రభుత్వ కాలంలోనూ చెప్పుకోదగ్గ పనులు జరిగిందీ లేదు. పైగా అవినీతి ఆరోపణలు, భూ కబ్జాలు వంటి ఆరోపణలు ఉన్నాయి. కేవలం పార్టీ బలంతో నెట్టుకు రావడం అంటే అంత సులువు కాదు. ప్రజల్లో మంచిపేరు గడిస్తే గానీ విజయం సొంతం చేసుకోలేమనేది గ్రహించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీలో నిలినిచ అభ్యర్థులు గుణగణాలు కూడా ఓటర్లు లెక్కిస్తున్నారనేది రాజకీయ విశ్లేషణ.

ఇక్కడ టిడిపి పరిస్థితి ఇలాగుంటే... బిజెపితో పొత్తు ముస్లింలు జీర్ణించుకోలేకున్నారు. ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్ తీసేస్తామని కూటమి నేతలు పదేపదే చెప్పడంతో... వైసిపి ఇదే అస్త్రాన్ని ముస్లిం వర్గాల్లో వాడుకుంటోంది. టిడిపి నేతలు కూడా ముస్లిం ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించాలంటే బిజెపి కండువాలు, జెండాలు తొలగించి వెళ్లాల్సి వస్తోందంటే బిజెపి ప్రభావం ఇక్కడ ముస్లిం వర్గాల్లో ఎలా ఉందో ఊహించుకోవచ్చు.

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కందుల నారాయణరెడ్డి గాయపడ్డారు. ఇటీవలే కోలుకున్నాడు. పలుమార్లు ఓడిపోయానని, రోడ్డు ప్రమాదం కొంత సానుభూతిగా పనిచేస్తుందని టిడిపి భావిస్తోంది. కందుల నారాయణరెడ్డి ఈ దఫా గెలిపించకపోతే శవాన్ని చూడాల్సి వస్తుందని పదేపదే చెప్పుకుంటున్నారు. రేపటి ఎన్నికలో సానుభూతి పని చేస్తుందో లేదో చూడాలి మరి..!

## కాంగ్రెస్ గెలుపు..అభివృద్ధికి మలుపు..

(మొదటిపేజీ తరువాయి)

గ్రోత్ సెంటర్‌లో పరిశ్ర మలు ఎక్కువ భాగం మూతపడ్డా యన్నారు. పరిశ్రమలపై ఆధారపడే వేలాది మంది ఉపాధి కోల్పోయారని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తో పాటు మౌలిక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. దీంతో ప్రజలు అభద్రతా భావంతో ఉన్నారన్నారు. మద్దిపాడు మండలంలో వామపక్షాలతో కలిసి లింగంకుంట, ఏడుగుండ్లపాడులో ఇంటింటీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఇండియా వేదిక మేనిఫెస్టో పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మద్దిపాడు మండల అధ్యక్షులు వసంత రాయుడు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షులు స్వర్ణ కృష్ణమూర్తి, సంతనూతలపాడు అధ్యక్షులు దుంపా యలమందారెడ్డి, విజేష్ రాజ్ సతీమణి పాలపర్తి మనీషా, సిపిఎం నాయకులు బంకా సుబ్బారావు, కిలారి పెద్దబ్బాయి, జజ్జర జయంతిబాబు, టి.శ్రీకాంత్, ఉబ్బా ఆదిలక్ష్మి, ఉబ్బా వెంకటేశ్వర్లు, పూసపాటి వెంకటరావు, రామారావు, యు.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరి ఆదినారాయణ పాల్గొన్నారు.

# బాపట్ల ఎంపీ సురేష్‌పై దాడి

## 15 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

**ప్రజాశక్తి-యద్దనపూడి, బాపట్ల జిల్లా**

బాపట్ల ఎంపీ, వైసిపి ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌పై యద్దనపూడి మండలం, చింతపల్లిపాడు వద్ద శనివారం దాడి జరిగింది. ఈ ఘటనపై యద్దనపూడి పోలీసుస్టేషన్‌లో 15 మంది టిడిపి కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది.

ఎంపీ నందిగం సురేష్ చీరాలలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని.. యద్దనపూడి మీదుగా మార్టూరు మండలం, వలపర్లకు వెళుతున్నారు. ఆయన వాహనానికి చింతపల్లిపాడు వద్ద టిడిపికి చెందిన ప్రచార వాహనాలతో కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఎంపీ తన వాహనాన్ని పక్కనపెట్టి.. టిడిపి వాహనాలు వెళ్లేందుకు దారి ఇచ్చారు. ర్యాలీలో ఉన్న టిడిపి కార్యకర్తలు కొందరు ఆయన కారు దగ్గరకు వచ్చి.. కారు ముందు ద్విచక్రవాహనాలు అడ్డం పెట్టి కారును తన్నడం చేశారు. వారిని అడిగేందుకు కారు దిగిన ఎంపీపై కర్రతో దాడి చేశారు. ఆ గ్రామానికి చెందిన అట్లూరి మహేష్ ఎంపీకి అడ్డుపడగా అతనికి తొడ మీద, ఎడమ చేతివేళ్ల మీద గాయాలయ్యాయి. అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎంపీ సురేష్ చింతపల్లిపాడు గ్రామం నుంచి నడుచుకుంటూ యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సిఐ సీతారాం, యస్ఐ జి.వి.చౌదరికి ఫిర్యాదు చేశారు. వైసిపి కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ఎంపీ సురేష్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని బైఠాయించారు. ఎంపీ సురేష్ ఈ సందర్భంగా తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని, అడ్డుపడిన తన అనుచరులపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 15 మంది టిడిపి కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఎంపీ దగ్గరకు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీ వచ్చి జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరసన కార్యక్రమంలో ఎంపీతో పాటు వైసిపి నాయకులు పెద్దివారిపాలెం సర్పంచి కె. అప్పయ్యచౌదరి, జంపాని కోటేశ్వరరావు, మైలా నాగేశ్వరరావు, దొడ్డా బ్రహ్మానందం, పి.రాంబాబు, దీపక్, అదిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు స్టేషన్‌లో టిడిపి కార్యకర్తపై వైసిపి నేత దాడి

## బాధితుడి బంధువుల ఆందోళన

**ప్రజాశక్తి - కర్లపాలెం**

తమ పార్టీ నుంచి టిడిపిలో చేరుతావా అంటూ వైసిపి నేత, సినీ నిర్మాత కోన వెంకట్ గణపవరం పంచాయతీ లంకమాలపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కత్తి రాజేష్‌పై పోలీస్ స్టేషన్‌లోనే దాడి చేసినట్లు బాధితుడి సోదరుడు కత్తి దయాకర్ ఆరోపించారు. పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన ఘటన గురించి తెలుసుకున్న టిడిపి బాపట్ల నియోజక ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ, బిజెపి నాయకుడు అన్న సతీష్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చీరల గోవర్ధన్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాధితుడికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు. రాజేష్‌పై దాడి చేసిన కోన వెంకట్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుని బంధువులు



పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితుడి బంధువులు

మాట్లాడుతూ ఎస్ఐ జనార్ధన్ వైసిపి నేతలకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలా పని చేస్తూ వైసీపీ నేతలు చెప్పిన విధంగా టిడిపి నేతలను స్టేషన్‌కు తీసుకువచ్చి కొడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు స్టేషన్ వద్ద నుంచి బయటికి వెళ్లమని తెలిపారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి, బిజెపి నేతలు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సమాచారాన్ని అందుకున్న డిఎస్‌పి మురళీకష్ణ, సిఐ హజరత్ బాబు స్టేషన్‌కు చేరుకొని నాయకులతో సంప్రదింపులు చేశారు. ఎస్ఐ జనార్ధన్ వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని, ఏ కారణంతో టిడిపి కార్యకర్తలను స్టేషన్‌కు తీసుకువచ్చి వైసిపి వారి చేత దాడి చేయించారని డిఎస్‌పిని నిలదీశారు. టిడిపి కార్యకర్త ఏదైనా తప్పు చేస్తే కేసు నమోదు చేయలే తప్ప బయటి వ్యక్తులతో కొట్టించే హక్కు పోలీసులకు ఎక్కడ ఉందని వారు ప్రశ్నించారు.

# బైకును ఢీకొన్న ట్రాలీ ఆటో..

## - ఇద్దరు యువకుల మృతి
## - మరో యువకుడికి గాయాలు

**ప్రజాశక్తి- మార్కాపురం రూరల్**

బైకును ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామ సమీపంలోని శనివారం సాయంత్రం చోటు చేసుకుంది అందిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని నికరంపల్లి గ్రామానికి చెందిన మీనుగ బ్రహ్మానాయుడు(19), అర్ధవీడు మండలం, అక్క భూతల పాలెం గ్రామానికి చెందిన నల్లబోతుల గోపీ(18) మార్కాపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలో విద్యనభ్యసిస్తున్నారు. గోపి నికరంపల్లి గ్రామంలో తమ అమ్మమ్మ ఇంటి వద్ద చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో బ్రహ్మానాయుడు, గోపీ, నరేంద్ర కలిసి బైకుపై మార్కాపురం వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి కొట్టాలపల్లి నుంచి మార్కాపురానికి వస్తున్న మినరల్ వాటర్ సరఫరా చేసే ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. దీంతో బ్రహ్మానాయుడు, నల్లబోతుల గోపికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. నరేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మతుల బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్ఐ వెంకటేశ్వర్ నాయక్ తెలిపారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



మృతుడు బ్రహ్మానాయుడు



మృతుడు గోపీ

# పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి ఎఎంసి ప్రాంగణంలో ఇవిఎంలు, ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ ప్రణాళిక గురించి కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి పాలపర్తి జాన్ ఇర్విన్ కలెక్టర్ దినేష్ కుమార్‌కు వివరించారు. సిటింగ్, బారికేడింగ్, వీడియోగ్రఫీ, వెహికల్ మేనేజ్మెంట్, సిబ్బందికి భోజన సదుపాయాలు తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రొసిజర్ అమలు చేయాలని ఆర్‌డిఒకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. **దర్శి :** స్థానిక ఎపి మోడల్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ దినేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఏర్పాట్ల గురించి దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలింగ్ అధికారులు సహకరించాలన్నారు.



ఏర్పాట్లను పరిశలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

## మహారాష్ట్ర మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి-మద్దిపాడు**

మహారాష్ట్రానికి చెందిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్దిపాడు బొడ్డురాయి సెంటర్‌లోని ఇంట్లో మద్యం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఇంట్లో సోదా చేశారు. 16 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని గంగా కుమార్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**29 మద్యం బాటిళ్లు స్వాధీనం**

మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి రోడ్డు వద్ద అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. పెద్దకొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మారెళ్ళ గుంటపాలెంకు చెందిన చెన్నుపాటి వెంకట శేషయ్య మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.




ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు

## ఓటు హక్కుపై అవగాహన

**ప్రజాశక్తి -కనిగిరి**

ఓటు హక్కు వినియోగంపై యువతకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టర్నింగ్-18 ప్రచారంలో భాగంగా ఈనెల 13న ప్రజాస్వామ్య పండుగలో యువత పాల్గొనే విధంగా ప్రేరేపించటానికి ఎన్నికల కమిషన్ మరియు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాతురు సచివాలయం పరిధిలో స్వీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి బి.శ్రీరాములు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాముఖ్యతను మరియు యువకుల పాత్రపై అవగాహన కలిగించారు. తొలిసారి ఓటు వేయబోయే నవతరంతో పాటు యువకులకు అవగాహన పెంపు కోసం టర్నింగ్-18 పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారి ఓటు వేయడం అనేది ప్రతి యువతకు ఒక కొత్త అనుభూతినిస్తుందని తెలిపారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఓటింగ్ శాతన్ని పెంచాలని యువకులను కోరారు. అనంతరం ఓటు హక్కును వినియోగించుకుంటామని యువకుల చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఒలు, విఆర్ఒ ప్రసాద్ రెడ్డి, గుడ్ హెల్ఫ్ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ పారా లీగల్ వాలంటీరు మంద్రు రమేష్ బాబు, యువకులు పాల్గొన్నారు.

## పొగాకు బేళ్ల అమ్మకం

**ప్రజాశక్తి-కొండపి**

కొండపి పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు అత్యధిక రూ.300 పలికినటుల వేలం నిర్వహణాదికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అక్కచెరువుపాలెం, పైడిపాడు, గోగినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 969 పొగాకు బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 886 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 83 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.300, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.261.49 పైసలు పలికింది.

## గ్రామాల్లో నగదు పంపిణీ

**ప్రజాశక్తి -సిఎస్ పురంరూరల్**

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు విలువ రూ.1,500 నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు ఇరుపార్టీల నాయకులు ఓటర్లకు గత రెండు రోజుల నుంచి నగదును పంపిణీ చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా నగదు పంపిణీ చేయడం గమనార్హం. అయినప్పటికీ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు.

# దద్దాలకు మద్దతుగా ముస్లిముల ర్యాలీ

**ప్రజాశక్తి -సిఎస్ పురంరూరల్**

వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ కు మద్దతుగా మండలంలోని ముస్లిం సోదరులు సిఎస్పురంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. డిజిపేటరోడ్ లోని ఈద్గా వద్ద నుంచి వైసిపి కార్యాలయం, బస్టాండ్ సెంటర్, పామూరు రోడ్, శివాలయం వీధి, ఎనిమిట్ట వీధి, రహమత్ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం జగన్ మోహన్ రెడ్డి కషి చేస్తున్నారని తెలిపారు. ముస్లింలకు ఇప్పుడున్న 4 శాతం రిజర్వేషన్ కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగాల్సి ఉందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికలలో ముస్లిం సోదరులందరూ ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యే గా దద్దాల నారాయణ యాదవ్ ను, వైసిపి ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అధిక గెలిపించాలని కోరారు. ఈ ర్యాలీలో మండల కో ఆప్షన్ మెంబర్ పఠాన్ అహబూ, షేక్ హుస్సేన్, షేక్ ఖాజా, రుసుం రఫీ, మొగల్ ఫకద్దీన్, ఖాదర్‌బాషా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

**దద్దాలకు మద్దతుగా ప్రచారం**

వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌కు మద్దతుగా ఆయన సోదరీమణులు వరలక్ష్మి, పుష్ప, శ్రీదేవి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని అయ్యాలూరి వారిపల్లి, జీనుగువారిపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో స్థానిక వైసిపి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. వైసిపి ఐదేళ్ల పానలలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా దద్దాల నారాయణ యాదవ్, వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని గెలిపించాలని తద్వారా జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముత్యాల భారతి, వైస్ఎ ంపిపి భూమిరెడ్డి ప్రభంజన, నాయకులు ముత్యాల నారాయణరెడ్డి, భూమిరెడ్డి వెంకట రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, గుడపురెడ్డి రమణారెడ్డి, ముత్యాల తిరుమల రెడ్డి, పెద్దిరెడ్డి రామిరెడ్డి, భూమిరెడ్డి రామిరెడ్డి, సన్నపురెడ్డి శివారెడ్డి, ముత్యాల రవిచంద్ర రెడ్డి, భేరి వివేకానంద రెడ్డి, ముత్యాల రమణారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

## ముగిసిన ఎన్నికల ప్రచారం

**ప్రజాశక్తి- కొత్తపట్నం**

మండల పరిధిలోని ఈతముక్కల గ్రామంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ ఆళ్ళ రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఎన్నికల ప్రచార ముగింపు ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గుర్తు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి అభ్యర్థులను గెలిపించాలన్నారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయ కన్వీనర్ తుమ్మ పుల్లయ్య,భాగ్యలక్ష్మి ,రావుల కుమారి ,సోషల్ మీడియా మండల కన్వీనర్ స్వర్ణ సుబ్బారావు,పూరిమెట్ల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ,రావుల శ్రీనివాస గౌడ్ ,రసూల్ బాషా కవర్తపు స్వాములు, అడిగోప్పల రవి, మాజీ వాలంటీర్లు గహసారధులు, మహిళలు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారం

**ప్రజాశక్తి-పిసిపల్లి**

సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ అభ్యర్థుల బంధువులు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. సాధారణంగా అభ్యర్థి తరుపున వారి కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామాలకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తుంటారు. అయితే సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తరువాత కొత్త తరహాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసిపి కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ తరుపున వారి కుమార్తెలు సాయి ప్రణవీ, రుషిత ఓటర్లను ఆకట్టుకొనే విధంగా వాట్సాప్‌లలో ప్రచారం చేస్తున్నారు. వారు వాట్సాప్‌లో మాట్లాడుతూ గతంలో జగన్ మామయ్యను సిఎంగా చేయడం వలన తనకు మంచి జరిగిందని, ఈ సారి కూడా మా డాడీని, చేవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. అదే విధంగా తమ నాన్నకు ఓటు వేసి గెలిపించాలంటూ టిడిపి కనిగిరి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కుమారు జయసింహారెడ్డి కూడా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఓట్లరు అభ్యర్థిస్తున్నాడు.



ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

## మంత్రి సురేష్‌కు మద్దతుగా ప్రచారం

**ప్రజాశక్తి-కొండపి**

వైసిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఆదిమూలపు సురేష్‌కు మద్దతుగా మండల పరిధిలోని పెరిదేపి గ్రామంలో స్త్రీశిశు సంక్షేమ సంఘం చైర్మన్ ,జడ్‌పిటిసి మారెడ్డి అరుణా వెంకటాద్రిరెడ్డి శనివారం ఎన్నిక ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలు ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందినట్లు తెలిపారు. ఆ పథకాలు కొనసాగలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదిమూలపు సురేష్‌ను, వైసిపి ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకుడు నల్లపు విజయరామరాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## వైసిపితోనే గ్రామాల అభివృద్ధి : మేరుగ

**ప్రజాశక్తి- నాగులులప్పపాడు**

వైసిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైసిపి సంతనూతల పాడు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగ నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని నిడమానూరు గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తననుఆదరిస్తే నియోజక వర్గ అభివద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సంక్షేమం, అభివద్ధి అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు ఎన్నికల ముందు సంక్షేమం, అభివద్ధి ఆగకుండా కొనసాగాలంటే తిరిగి జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసు కోవాలన్నారు. ప్యానుగుర్తుకే ఓటువేసి తనను ఆదరించాలని కోరారు ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు, సర్పంచి వడ్డి ముక్కలశ్రీను, వైస్ ఎంపిపి మల్లెలజాన్సన్, పి.పరందామి రెడ్డి, పి.శ్రీమన్నారాయణ, వైసిపి నాయకులు తదిరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

## టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : బిఎన్

**ప్రజాశక్తి -నాగులుప్పలపాడు**

టిడిపితోనే రాష్ట్రాభివద్ధి సాధ్యమని టిడిపి కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బిఎన్. విజయకుమార్ తెలిపారు. మండల పరిధిలోని పోతవరం గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లా డుతూ వైసిపి అరాచక పాలను తరిమి కొట్టేందుకు ప్రతికార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే పరిశ్రమలు వస్తాయని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, బాపట్ల పార్లమెంట్ ఎంపీగా తెన్నేటి కష్ణప్రసాదును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివి పున్నారావు, ఒక్కంటి శ్రీనివాసరావు, కాకర్ల లక్ష్మి వరప్రసాదు, ఎల్వం, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయకుమార్

## డాక్టర్ ఉగ్రకు మద్దతుగా ప్రచారం

**ప్రజాశక్తి-పిసిపల్లి**

టిడిపి కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహ రెడ్డిని గెలిపించాలంటూ మాదిరెడ్డి కొండారెడ్డి, ఆయన అనుచరులు టిడిపి నాయకులతో కలిసి బుడ్డారెడ్డిపల్లి, విజయనగర్ కాలనీ, పిసిపల్లి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పిసిపల్లికి చెందిన మాదిరెడ్డి కొండారెడ్డి బొంబాయిలో ఉంటున్నారు. ఆయన గతంలో రాజకీయాలకు అతీతంగా అనేక మందికి సహాయ, సహకారాలు అందించారు. ఆయన పేరుతో ఓ భవనం నిర్మించి గ్రంథాలయానికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వేమూరి సుబ్బారావు, జోసఫ్, గోపవరపు సత్యంరెడ్డి, పులి ప్రతాప్, పులి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సిఎస్.పురం :** టిడిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమారుడు జయసింహారెడ్డి, కుమార్తె ఊహశ్రీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమ తండ్రిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, మన్నేపల్లి శ్రీనువాసులు, బొబ్బురి రమేష్, బండారు వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టి.డిపి నాయకులు

## వైసిపితోనే పేదల సంక్షేమం : కదిరి

**ప్రజాశక్తి-సిఎస్‌పురం**

వైసిపితోనే పేదల సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల ఆర్థికాభివద్ధి కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కు తుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, వైసిపి ఒంగోలు ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి షేక్ ఖాదర్‌బి బుజ్జి, గొను చంద్రశేఖర్‌రెడ్డి, డి.మాలకొండయ్య, నేదురపల్లి రాజారత్నం, బలభద్ర ప్రభాకర్, కొట్టే వెంకటనారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

**దద్దాలకు మద్దతుగా ప్రచారం**

**సిఎస్.పురం :** వైసిపి కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని అయ్యలూరివారిపల్లిలో సర్పంచి ముత్యాల భారతి, నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి భూమిరెడ్డి, ప్రభంజన ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు అదేవిధంగా మండల పరిధిలోని విభైలు గ్రామంలో దద్దాల నారాయణ యాదవ్ సోదరీమణులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తమ సోదరుడు దద్దాల నారాయణ యాదవ్, వైసిపి ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నుంచి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, ముత్యాల నారాయణరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
ఆదివారం 12 మే 2024


సమావేశంలో మోపిదేవి వెంకటరమణారావు

## వైసిపి మేనిఫెస్టోలో పేదల సంక్షేమం

**ప్రజాశక్తి - నగరం**

ప్రజల భవిష్యత్తు దృష్ట్యా దిశ, నిర్దేశించడానికి, ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పర్చడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను విడుదల చేశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. భగవత్ గీత, బైబిల్, కురాన్ వంటి పవిత్ర గ్రంథాలతో సమానంగా మేనిఫెస్టోను భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తామని చెప్పారు. 2019 ఎన్నికల ముందు నవ రత్నాలు దగ్గర నుంచి వాటన్నిటిని మెరుగైన రీతిలో ప్రజలకు అందించేందుకు కృషి చేసినట్లు చెప్పారు. గత ఐదేళ్లలో అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలకు కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితిలో కూడా అమలు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలను ఆదుకోవడానికి ఎంతో చేయూతనిచ్చి ఆదుకున్నట్లు చెప్పారు. ఈనెల 13న జరుగనున్న ఎన్నికల్లో మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ప్రస్తుత ఎన్నికల్లో రెండు పేజీలతో మేనిఫెస్టో ప్రకటించినట్లు తెలిపారు. 2014లో చంద్రబాబు మేనిఫెస్టోలోని రైతు రుణమాఫీ హామీ 10శాతం కూడా చేయలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య, చందోలు దేవదాసు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక బస్సులు

**ప్రజాశక్తి - బాపట్ల**

ఎన్నికల సిబ్బంది కోసం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు ప్రజా రవాణా అధికారి టి శ్రీనివాస్ శనివారం తెలిపారు. అద్దంకి నుండి పర్చూరుకు 10బస్సులు ఉదయం 6గంటలకు బయలు దేరుతాయని తెలిపారు. చీరాల నుండి పర్చూరుకు 10బస్సులు, రేపల్లె నుండి వేమూరుకు 20బస్సులు, బాపట్ల నుండి రేపల్లెకు 8 బస్సులు, రేపల్లె నుండి ఉదయం 6గంటలకు భట్టిప్రోలు, చెరుకుపల్లి, బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి వరకు ఎన్నికల సిబ్బంది కొరకు ప్రత్యేకంగా 2బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అద్దంకి నుండి మార్టూరు, పర్చూరు, చీరాల, బాపట్ల, చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లెకు 2బస్సులు నడుపుతున్నామని అన్నారు. ఈ బస్సులు బయలుదేరే పాయింట్లో ఉదయం ఆరు గంటలకు బయలుదేరు తాయని అన్నారు. కలెక్టర్ పి రంజిత్ భాషా ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు

**ప్రజాశక్తి - పాదిలి**

మండలంలో 66 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల జరుగనుండగా వాటిలో 14 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. 195- కుంచేపల్లి ఎంపీపీ స్కూల్, 196- గురవాయపాలెం ఎంపీపీ స్కూల్ రూమ్ నెంబర్ 2, 199 - తుమ్మగుంట ఎంపీపీ స్కూల్ న్యూ బిల్డింగ్, 201- అక్కచెరువు ఎంపీపీ స్కూల్ జనరల్ న్యూ బిల్డింగ్, 211- నందిపాలెం ఎంపీపీ స్కూల్, 212-పోతవరం ఎంపీపీ స్కూల్ జనరల్, 213- పోతవరం ఎంపీపీ స్కూల్ ఏఎ, పాదిలి పట్టణంలో 216- జడ్పీహెచ్ఎస్ - తాసిల్దార్ ఆఫీస్ దగ్గర, 222 - గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్, కొత్త రూమ్-6, 243 - ఎంపీపీ స్కూల్ బాప్టిస్ట్ పాలెం మెయిన్ రోడ్, 244-ఎంపీపీ స్కూల్ అదనపు తరగతి గది బాప్టిస్ట్ పాలెం, 253- ఉప్పలపాడు ఎంపీపీ స్కూల్ రూమ్ నెంబర్ 1, 254- ఉప్పలపాడు ఎంపీపీ స్కూల్ రూమ్ నెంబర్ 2, 255- ఏలూరు ఎంపీపీ స్కూల్ రూమ్ నెంబర్1 కేంద్రాలను సమస్యత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శనివారం నుండి 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అధికారులు సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని చెప్పారు. అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సంక్షేమం చూసి.. గెలిపించండి

**ప్రజాశక్తి - నగరం**

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి వైసిపికి ఓటు వేయాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు కోరారు. మండలంలోని సజ్జవారిపాలెం, చిరకాలవారిపాలెం, బోరమాదిగపల్లి, బెల్లంవారిపాలెం, న్యూ అంబేద్కర్ నగర్, ఏలేటిపాలెం గ్రామాల్లో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. కొలగనివారిపాలెంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఎంఎల్ఏగా డాక్టర్ ఈవూరు గణేష్, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నూరుశాతం అమలు చేశారని చెప్పారు. ప్రతి ఒక్కరికి


ఎన్నికల ప్రచారంలో వైసిపి నేతలు

అందుబాటులో ఉండేలా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందజేసినట్లు చెప్పారు.

# వైసిపి పాలనలో ముస్లిములపై దాడులు

**టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి**

**ప్రజాశక్తి - మార్కాపురం రూరల్**

పరిపాలన అంటే ప్రజా రంజకంగా ఉండాలి తప్ప స్వార్థం కోసం దోపిడీ చేసి మోసం చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్పక మానరని టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ నందు శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలపై దాడులు తీవ్రం అయ్యాయని ఆరోపించారు. మైనారిటీల నిధులు మళ్లించి సంక్షేమ పథకాలు ఆపేశారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలపై 100కుపైగా దాడులు జరిగాయని అన్నారు. నంద్యాలలో ఓ కుటుంబం బలవన్మరణం, నరసరావుపేటలో మసీదు ఆస్తుల పరిరక్షణకి పోరాడిన టీడీపీ నేతను హత్య చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు చూస్తుంటే రాష్ట్రంలో మైనారిటీలకు రక్షణలేదని అన్నారు. అరకొర పథకాలున్నా పొందేందుకు వీలులేని అడ్డగోలు నిబంధనలు విధం చారని వాపోయారు. వైసీపీ పాలనలో ఆర్థికంగానూ, సామాజికంగానూ మైనార్టీలకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. మైనార్టీల రక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి ముస్లిం మైనార్టీ సోదరులకు ఎప్పుడు అండగా నిలుస్తుందని అన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. మైనారిటీలకు భద్రత కల్పిస్తామని అన్నారు. సంక్షేమానికి కృషి చేస్తామని



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

తెలిపారు. మైనారిటీలకు వైసిపి చేసిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చంద్రబాబు పదేపదే వివిధ సభల్లో చెబుతుండడంతో వైసిపి నేతల వెన్నుల్లో వనుకు పుట్టడం మొదలైందని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో ముస్లింలకు జరిగిన అన్యాయంను మైనారిటీ సోదరులు మర్చిపోలేదన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో మైనారిటీలు సోదరులు టిడిపికి ఓట్లు వేయడానికి సిద్ధపడ్డారని అన్నారు. సమావేశంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్, టిడిపి ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి పి ఇబ్రహీం ఖాన్, పి నాగూర్ ఖాన్, టిడిపి నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, మాజీ కౌన్సిలర్ షేక్ షరీఫ్, షేక్ నాసర్ సాహెబ్, ఎం షాకీర్ బేగ్, సయ్యద్ నాయబ్ రసూల్, షేక్ నూరుల్లా, సయ్యద్ రహమతుల్లా, ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ వేదిక పట్టణ అధ్యక్షులు మొగల్ జాబీర్ హుస్సేన్ బేగ్, షేక్ షఫీ పాల్గొన్నారు.

# ఆనందబాబు సమక్షంలో టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి - వేమూరు**

అమృతలూరు మండలం ఎలవర్రు, గోవాడ గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టిడిపి అభ్యర్థి నక్కా ఆనందబాబు సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. వీరికి ఆయన టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి చంద్రబాబు సారథ్యంలోనే జరుగుతుందనే దృక్పథంతో వైసిపిని టిడిపిలో చేరినట్లు పేర్కొన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులైన తనను ఎంఎల్ఏగా, బాపట్ల ఎంపిగా తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను


టిడిపిలో చేరిన వారితో నక్కా ఆనందబాబు

గెలిపించాలని కోరారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి సమోచిత స్థానం లభిస్తుందని అన్నారు. పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈపాటికే గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లేక ప్రజల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీని నుండి రాష్ట్రాన్ని కాపాడేందుకు వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో అమృతలూరు, ఎలవర్రువాడ గ్రామాల టిడిపి, జనసేన నాయకులు ఉన్నారు.

# ఐలవరంలో టిడిపి శ్రేణుల భారీ ర్యాలీ

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

ఎన్నికల ప్రచార సమయం ముగిసేలోగా టిడిపి శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండలంలోని ఐలవరంలో టిడిపి నాయకులు పెద్ద ఎత్తున గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమికి ప్రతి ఒక్కరు ఓటు వేసి రాష్ట్ర భవిష్యత్తు కాపాడాలని కోరారు. రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు కొనసాగించి, నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు


ఐలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులు

టిడిపి, జనసేన ఉమ్మడిగా రూపొందించిన మేనిఫెస్టో ప్రకారం ప్రజల భవిష్యత్తు టిడిపితోనే కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టిడిపి రూపొందించిన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఎంఎల్ఏగా తనను, బాపట్ల ఎంపిగా తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.


రిక్షాపై ఏనుగు విగ్రహం

## రిక్షాపై ఏనుగు ప్రతిమతో ప్రచారం

**ప్రజాశక్తి - బాపట్ల**

బహుజన సమాజ పార్టీ ఎన్నికల గుర్తు ఏనుగు ప్రతిమను రిక్షాపై ఎక్కించి ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బిఎస్పి ఎంఎల్ఏ అభ్యర్థి గుదే రాజారావు వినూత్న రీతిలో ప్రచారం చేశారు. రిక్షాపై ఏనుగు విగ్రహం ఉంచి పట్టణంలో మైకుల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను ఆకర్షించారు. ప్రచారంలో ఏనుగు ఘీంకరిస్తున్న శబ్దంతో బీఎస్పీకి ఓటేయాలని కోరుతూ రాజారావు తన ప్రచారాన్ని శనివారం పరిసమాప్తం చేశారు.

## మీ ఆడబిడ్డను ఆదరించండి : లక్ష్మి

**ప్రజాశక్తి - దర్శి**

మీ ఆడబిడ్డను ఆదరించి గెలిపించాలని దర్శి టిడిపి కూటమి ఎంఎల్ఏ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి కోరారు. ముండ్లమూరు మండలంలోని ఉల్లగల్లులో ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా ముస్లిం మహిళలు ఏర్పాటు చేసిన కేకును కట్‌చేసి పంచి పెట్టారు. గత 45రోజుల నుండి నియోజకవర్గంలో ఆదరించి తన వెంట నడిచిన మహిళలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంఎల్ఏగా తనను, ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని గెలిపించాలని కోరారు. గొట్టిపాటి లక్ష్మికి మద్దతుగా సినీ నటుడు శివాజీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## కాలువలో పడిన కారు

**ప్రజాశక్తి - కారంచేడు**

స్థానిక ఆంజనేయస్వామి బొమ్మ సమీపంలో కారు అదుపుతప్పి కాలువలోకి తీసుకెళ్లిన సంఘటన శనివారం జరిగింది. చీరాల నుంచి కారంచేడు వైపు అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి కారంచేడు రోడ్డులోని ఆంజనేయ స్వామి బొమ్మ వద్ద కాలువలో బోల్తా పడింది. వెంటనే స్పందించిన స్థానికులు కారులోని ఇద్దరి వ్యక్తులను సురక్షితంగా బయటికి తీశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు

**ప్రజాశక్తి - పాదిలి**

ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తహశీల్దారు మహమ్మద్ జియా సూచించారు. మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఆర్ఐ కె సుబ్బారావు, వీఆర్ఓలు మురళి, నారాయణ, బిఎల్ఓ విజయ ఉన్నారు.

## అవర్ణకు ఐఐఎం సర్టిఫికెట్

**ప్రజాశక్తి - రేపల్లె**

డాక్టర్ చలపతిరావు ఎడ్యు కేషనల్ సొసైటీకి చెందిన రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ కల్కతా నుండి సర్టిఫికెట్ అందజేశారు. ఎడ్యుకేషన్ లీడర్స్ ప్రోగ్రాంను పూర్తి చేసినందుకు ఈ సర్టిఫికెట్ అందుకున్నారు. ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చు కుంటూనే ఉండాలని తెలిపారు. కొత్త కోర్సులు నేర్చు కోవడం వల్ల మన మేధాశక్తి ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. అందుకే ఏ కొత్త కోర్సునైనా చేయడానికి తను ఎప్పుడు ముందుంటానని తెలిపారు. పాఠశాల్లో విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ఆచరిస్తారని, ఎన్నో కొత్త విషయాలను నేర్చు కుంటూ తమ మేధాశక్తిని పెంచుకోవాలని అన్నారు.



# సార్వత్రిక సమరం





ఎన్నికల ప్రచారంలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

## ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి

ప్రజాశక్తి - సంతమాగులూరు

టిడిపితోనే పేదలకు అభివృద్ధి, సంక్షేమం అమలు సాధ్యపడుతుందని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ఏల్చూరు గ్రామం ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీల కాలనీల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎంఎల్ఎగా తనను, బాపట్ల ఎంపీగా తెనేటి కృష్ణ ప్రసాదును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చేవూరు వాసురెడ్డి, డి గాలెయ్య, పెదగాలెయ్య, దళిత నాయకులు, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



జెడ్‌పిటిసి నాగమణిని టిడిపిలోకి ఆహ్వానించిన ఎంఎల్ఎ

## టిడిపిలో చేరిన జడ్పీటీసీ నాగమణి

ప్రజాశక్తి - నగరం

జడ్పీటీసీ మాన్యం నాగమణి ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. ఆమెకు టిడిపి కండువ కప్పి సాదరంగా ఎంఎల్ఎ సత్యప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, టిడిపి నగరం మండల అధ్యక్షులు చింతల సుబ్బారావు, పిన్నిబోయిన చింతారావు, విచారపు కుటుంబరావు, ఆళ్ళ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన వారితో అశోక్ బాబు

## అశోక్‌బాబు సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం ఆలపాడు గ్రామ సర్పంచి చేబ్రోలు సంపత్ కుమార్‌తో పాటు మరో వంద కుటుంబాలు శనివారం వైసిపిలో చేరాయి. వీరంతా జనసేన పార్టీకి రాజీనామా చేసి వైసిపిలో చేరుతున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన ముందుకు కొనసాగడానికి జగన్మోహన్‌రెడ్డి ద్వారా మాత్రమే అమలు జరుగుతుందనే దృక్పథంతో వైసిపిలో పని చేయాలని నిశ్చయించుకొని వైసిపిలో చేరుతున్నట్లు తెలిపారు. సచివాలయాలు, వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇళ్ల వద్దనే ఇవ్వడం తమను ఆకర్షించిందని అన్నారు. వారందరికి వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చేసేదే చెప్తాడని, చెప్పిందే చేస్తాడని అన్నారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే మరోసారి జగన్మోహన్‌రెడ్డి మరో సారి సిఎం కావాలని కోరారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని, కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. టిడిపి మాటలు నమ్మవద్దని చెప్పారు. ఎంఎల్ఎగా తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చుండూరు మండలం ఆలపాడు గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసిపి అరాచక పాలన అంతం పలకాలి

ప్రజాశక్తి - బాపట్ల

గడచిన ఐదేళ్లుగా వైసిపి పాలనలో అరాచకం రాజ్యమేలిందని టిడిపి, జనసేన ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేసన నరేంద్ర వర్మ ఆరోపించారు. తన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఇసుక మాఫియా, గంజాయి, భూముల కొనుగోలు విక్రయాల్లో భారీగా లంచాలతో అవినీతికి కోన రఘుపతి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని ఆరోపించారు. ఐదేళ్లలో 5 రోడ్లు మినహా అభివృద్ధి లేదని అన్నారు. మెడికల్ కళాశాల పునాదులకే పరిమితమైందని అన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందకపోయినా, అవినీతి మాత్రం అందరికీ సమానంగా పంచే వ్యక్తిగా కోన



మాట్లాడుతున్న నరేంద్ర వర్మ, సతీష్ ప్రభాకర్

రఘుపతి ఖ్యాతి గడించారని పేర్కొన్నారు. ఈ అరాచకం, నియంత పోకడ అంతం చేసేందుకు టిడిపిని గెలిపించాలని కోరారు. మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ బాపట్లలో జరిగిన అవినీతిని ఓటు హక్కు ద్వారా అంతం చేయాలని కోరారు. బాపట్లను కాపాడుకోవటానికి టిడిపికి ఓటు వేసి ఎంఎల్ఎగా నరేంద్ర వర్మను, ఎంపిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. రానున్న టిడిపి ప్రభుత్వంలో ఇసుక మీద ఆంక్షలు ఉండవని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసిపి నేతల కనుసన్నల్లో గంజాయి విక్రయించి యువత భవిష్యత్తును మత్తుపాలు చేశారని ఆరోపించారు. తన తండ్రి కోన ప్రభాకరరావు విగ్రహం కోసం ఆలయాలను కూల్చే అహంకారికి ఓటేస్తారా అని ప్రశ్నించారు. నిజాయితీ పరుడైన వ్యక్తికి ఓటు వేస్తారా అనే అంశాన్ని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## పోటాపోటీగా ర్యాలీలు

ప్రజాశక్తి - పొదిలి

ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా పట్టణంలో వైసిపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పోటా పోటీగా శనివారం ర్యాలీలు నిర్వహించారు. పోతవరం గ్రామం వద్దకు చేరుకున్న వైసిపి నాయకులు అక్కడి నుంచి పట్టణం లోకి ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భం గా ఒంగోలు పార్లమెంటు వైసిపి



ఎన్నికల ప్రచారంలో అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థి అన్నా రాంబాబు, ఎపిఐఐసి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మండల, గ్రామ స్థాయి నాయకులు డప్పు వాయిద్యాలతో, భాణ సంచాతో ర్యాలీగా విశ్వనాథపురం, పెద్ద బస్టాండ్, చిన్న బస్టాండ్ మీదుగా ర్యాలి నిర్వహించారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మార్కాపురం అడ్డరోడ్ వద్ద నుండి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మార్కాపురం టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కుమారుడు కందుల విఘ్నేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు మార్కాపురం అడ్డరోడ్డు నుండి విశ్వనాథపురం సెంటర్, పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంక్ సెంటర్, పెద్ద బస్టాండ్, చిన్న బస్టాండ్ మీదుగా కార్యకర్తలతో హోరెత్తించారు. పోటా పోటీగా నిర్వహించిన రెండు ర్యాలీలపై స్థానికులు చర్చించుకున్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

### సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి - మార్కాపురం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఉదయం ఐదున్నర గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. ఆ తర్వాత 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో కూడా బార్లు తీరి ఉంటే ఓటింగ్ కోసం సమయాన్ని పొడిగిస్తామని చెప్పారు. ఎండల తీవ్రత కారణంగా వీలైనంతవరకు ఓటర్లంతా ఉదయాన్నే ఓటు హక్కు వినియోగించు కునేందుకు సిద్ధం కావాలన్నారు. ఎండవేడికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. దీంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. నియోజకవర్గంలో 205 పోలింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. 2.14లక్షల ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ సమయంలో అక్రమాలు



సమావేశంలో సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

జరగకుండా 146 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా యువతకు మండలంలోని ధర్మడుగులో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళల కోసం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని 81వ పోలిం కేంద్రాన్ని కేటాయించినట్లు చెప్పారు. తర్లపాడు మండలంలో 12 , 132, కొనకనమెట్ల మండలంలో 167వ పోలింగ్ కేంద్రాన్ని గ్రీన్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు చెప్పారు. 227, 244 పోలింగ్ కేంద్రాలను ఈసీఐలుగా గుర్తించినట్లు చెప్పారు. 69 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని అన్నారు. మొబైల్ పోలీస్ వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన తమకు తెలియజేయాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

## ఇండియా వేదికతోనే ప్రజాస్వామ్య రక్షణ

ప్రజాశక్తి - మెదరమెట్ల

ఈనెల 13న జరుగునున్న ఎన్నికల్లో ఇండియా వేదిక ఎంఎల్ఎ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్ బాబును, బాపట్ల ఎంపీ అభ్యర్థి జెడి శీలంను గెలిపించాలని



ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం

కోరుతూ సిపిఎం నేతలు శనివారం ప్రచారం నిర్వ హించారు. మండలంలోని ప్రసంగలపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు, వై రవి బాబు, కంచర్ల సురేష్, కంచర్ల శ్రీనివాసరావు, నందికోలు సుబ్బారావు, నక్కల పెద్ద అంజయ్య, చావా కోటేశ్వరరావు, బొంత దశరథ పాల్గొన్నారు.

## విస్తృతంగా టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపి, జనసేన ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఎన్నికల ప్రచారం శుక్రవారం రాత్రి విస్తృతంగా నిర్వహించారు. భారీ ర్యాలీతో ప్రత్యేక ప్రచార వాహనంపై



ప్రచార వాహనంపై టిడిపి నాయకులు

ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్, మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ నేతృత్వంలో నిర్వహించిన ప్రచార ర్యాలీ పట్టణంలో సాగింది. గడియార స్తంభం వద్ద ప్రచారం ముగింపు పలికారు. ఈనెల 13న జరగబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఒకరోజు ముందే ప్రచారాన్ని ముగించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు టిడిపికి ఓట్లు వేయించే దిశగా గ్రామాల్లో, పట్టణంలో తమ వంతు కర్తవ్యం నిర్వర్తించాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. టిడిపి పట్ల ప్రజలకున్న నమ్మకానికి మరింత వెన్నుదన్నుగా మాజీ ఎంఎల్ఎ చీరాల గోవర్ధన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు గుండ్రెడ్డి శివ, న్యాయవాది కళ్లం హరినాధరెడ్డి టిడిపిలో చేరడం మరింత ఊపు తెచ్చిందని అన్నారు. ఇదే వరవడి ఓట్లు వేయించే వరకు కొనసాగాలని నరేంద్ర వర్మ కోరారు. ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివ నారాయణ, చీరాల గోవర్ధన్‌రెడ్డి, నరాలశెట్టి ప్రకాశరావు, గుండ్రెడ్డి శివ పాల్గొన్నారు.

## వైసిపి అభ్యర్థులను గెలిపించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈనెల 13న జరిగే ఎన్నికల్లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు, బాపట్ల ఎంపి అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ డివి లలిత కుమారి ఓటర్ స్లిప్పులు శనివారం పంపిణీ చేశారు.



ఓటర్ స్లిప్పులు అందజేస్తున్న ఎంపీపీ లలిత

భట్టిప్రోలులో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు కొనసాగడానికి మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, బాలు, రెబ్బ, మున్నీ పాల్గొన్నారు.



# సార్వత్రిక సమరం



# పేదల సంక్షేమమే ధ్యేయం : స్వామి

**ప్రజాశక్తి- కొండపి**

పేదల సంక్షేమమే టిడిపి ధ్యేయమని టిడిపి కూటమి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మండల కేంద్రమైన పొన్నలూరులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని బలవంతంగా తెస్తున్నారని విమర్శించారు. ఈ చట్టం అమలైతే ప్రజలు తమ ఆస్తులు కాపాడుకోవడానికి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబు నాయుడు రెండో సంతకం చేస్తారని తెలిపారు. చంద్రబాబు తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ టిడిపి మహిళలకు అండగా నిలుస్తుందన్నారు. చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేసినట్లు తెలిపారు. కొండపి నియోజకవర్గ ప్రజల జీవనాడి అయినా సంఘమేశ్వరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు సాగునీరు, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా స్వామిని, ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులు రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, పిల్లి వెంకటనారాయణ రెడ్డి, గుమ్మళ వెంకట్రావు, మండవ మురళి, జనసేన నాయకులు కనపర్తి మనోజ్ కుమార్, పల్లపోతు ప్రసాద్, పల్లపోతు రమేష్, పల్లపోతు కోటేశ్వరరావు, టిడిపి జనసేన, బిజెపి, నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న మాగుంట రాఘవరెడ్డి

**శింగరాయకొండ** : టిడిపితోనే రైతులకు అండఅని టిడిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచాన్ని శనివారం ముగించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్‌షోలో ఎమ్మెల్యే స్వామి మాట్లాడారు. గతంలో టిడిపి హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. దామచర్ల సత్య మాట్లాడుతూ యర్రగొంటపాలెం నుంచి వచ్చిన సురేష్ మళ్లీ యర్రగొండపాలెం పోతారన్నారు. చిత్తూరు నుంచి వచ్చిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మళ్లీ చిత్తూరు పోతారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా స్వామిని, ఎంపీగా మాగుంట శ్రీనివాసులు రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

## పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

**ప్రజాశక్తి-కొండపి**

నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. కొండపి నియోజకవర్గంలో మొత్తం 283 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 11వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల ప్రచార గడవు ముగిస్తుందన్నారు. అనంతరం నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు ఎవరూ ఇక్కడ ఉండకూడదన్నారు. పోలింగ్ సమయంలో అభ్యర్థుల తరుపు వారు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో శిబిరాలు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. 100 మీటర్ల లోపు వాహనాలకు అనుమతి లేదని తెలిపారు.

# పేదల సంక్షేమానికి కృషి : బాలినేని

**ప్రజాశక్తి- కొత్తపట్నం**

పేదల సంక్షేమానికి ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు వైసిపి ఒంగోలు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సంకువానిగుంట, కె.పల్లెపాలెం గ్రామాలో బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో వైపిని గెలిపించాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సిఎం అయితే పేదలకు సంక్షేమ పథఖాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి , జడ్‌పిటిసి సైకం లక్ష్మి శారద, స్థానిక సర్పంచి విశ్వనాథపల్లి ఆనంద్, వైసిపి మండల నాయకులు డాక్టర్ రాఘవ, ఆళ్ల రవీంద్రారెడ్డి, దాసూరి గోపాల్ రెడ్డి, గాలి ముసలారెడ్డి, పాలకేంద్రం సురేష్, తదితరులుపాల్గొన్నారు.



రోడ్‌షోలో ఎమ్మెల్యే బాలినేని

# జెండాలు మార్చే వ్యక్తిని కాదు.. మోసే వ్యక్తినే..

## వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

తాను జెండాలు మార్చే వ్యక్తిని కాదని..జెండాలు మోసే వ్యక్తినేనని ప్రజలు ఆలోచించుకొని ఓటు వేయాలని వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. వైసిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం పాల్గొన్నారు. అందులో భాగంగా పాకల రోడ్డు వద్ద నుంచి కందుకూరు రోడ్డు వరకూ రోడ్ షో నిర్వహించారు. అనంతరం కందుకూరు రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడారు. తాను జెండాలు మోసే వ్యక్తేనని, ఐదేళ్లకు ఒకసారి జెండా మార్చే వ్యక్తిని కాదన్నారు. ప్రజలు జండాలు మార్చే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జండా మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. కొండపిలో గత పది సంవత్సరాలుగా వైసిపి ఓటమికి నాయకులే కారణమని, అలాంటి పరిస్థితి ఇప్పుడు రాకుండా జెండా ఎగరేసేందుకు సిద్ధం కావాలన్నారు. చంద్రబాబు పుట్టిన చంద్రగిరి నియోజకవర్గం నుంచి తాను గతంలో గెలిచినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**కొండపి నియోజక వర్గ మేనిఫెస్టో విడుదల**

కొండపి నియోజకవర్గ మేనిఫెస్టోను వైసిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి , రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విడుదల చేశారు. మర్రిపూడి, పొన్నలూరు మండలాలకు ప్రయోజనం చేకూర్చేందుకు సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. కొండేపి నియోజకవర్గంలోని ఎస్‌సి కాలనీలో శ్మశాన వాటికలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. శింగరాయకొండ, మరిపూడి మండలాల్లో అసైన్మెంట్ భూములను క్రమబద్ధీకరణకు కషిచేస్తానని తెలిపారు. శింగరాయకొండ బైరాగి మాన్యంలోని స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చేస్తామన్నారు. జలజీవని మిషన్ ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. పొగాకు, సుబాబులు రైతులకు మంచి ధర వచ్చేలా చూస్తామన్నారు. శింగరాయకొండ గ్రామ పంచాయతీలో హిందువుల శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తామన్నారు. కాళహస్తి రైల్వే లైన్ పూర్తి చేసేందుకు కషి చేస్తామన్నారు. పాలేరు మరియు మన్నేరు నదుల్లో చెక్ డాములు నిర్మాణం చేపడతామన్నారు. తీర ప్రాంతంలో సురక్షితంగా ఉంచేందుకు స్పీడ్ బోట్లను అందజేస్తామని తెలిపారు. పార్కుల నిర్మాణం చేపడతామని తెలిపారు. శింగరాయకొండను మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. శింగరాయకొండలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ మేరకు మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తేకొండపికి అభివద్ధిని పరిచయం చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో సామంతుల రవికుమార్ రెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, డాక్టర్ యన్నా బత్తిన కార్తీక్, యనమల మాధవి, తన్నీరు ధర్మరాజు, షేక్ సలీం బాషా, చుక్కా కిరణ్ కుమార్, షేక్ కరీం, రాపూరి ప్రభావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్నడాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

## ఆదరిస్తే.. అభివృద్ధి చేస్తా : గొట్టిపాటి

**ప్రజాశక్తి-దర్శి**

తనను ఆదరిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేస్తానని టిడిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. దర్శిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పోలేరమ్మ గుడి వద్ద నుంచి గడియార స్తంభం సెంటర్ మీదుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకూ సినీ నటుడు శివాజీ, మాజీ ఎమ్మెల్యే పాపారావుతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా గడియార స్తంభం సెంటర్ లక్ష్మి మాట్లాడుతూ తమ తాత గొట్టిహనుమంతరావు, తన తండ్రి నరసయ్య, బాబాయ్ రవికుమార్ ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. తాను దర్శి నియోజకవర్గంలో 97 పంచాయతీల పరిధిలోని 135 గ్రామాలు, దర్శి నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో పర్యటించినట్లు తెలిపారు. ఎక్కడికి వెళ్ళినా ప్రజలు, మహిళలు తననున ఆదర్శించినట్లు తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే దర్శిలోనే ఉండి వైద్యం చేసుకుంటూ ప్రజలకు వైద్యసేవలు అందిస్తానని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే తనను, ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసరెడ్డికి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాసరావు, డాక్టర్ లలితసాగర్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో అశోక్‌రెడ్డి

## టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి-గిద్దలూరు**

మండల పరిధిలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన ఆరవీటి శ్రీను ఆధ్వర్యంలో టిడిపి కూటమి గిద్దలూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. అశోక్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి వైసిపి పాలనలోఅన్ని వర్గాలు ప్రజలు విసుగు చెందినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. సూపర్ సిక్స్ పథఖాలతో ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అశోక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం**

మండల పరిధిలోని కంచిపల్లె ఎస్‌సి కాలనీలో టిడిపి కూటమి గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి తనయుడు ముత్తుముల దివ్యేష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టోలోని అంశాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తమ తండ్రి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పి వకుల్ జిందాల్

**ప్రజాశక్తి - పంగులూరు**

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మండలంలోని చందలూరు, నూజిల్లపల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. ఐదుగురికి మించి గుంపులుగా తిరగ వద్దని తెలిపారు. ఎన్నికల సందర్భంగా గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చీరాల నియోజకవర్గంలోని వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పందిళ్లపల్లిలోని ఎంపీపీ పాఠశాల, జెడ్పి ఉన్నత పాఠశాల, పర్చూరు నియోజకవర్గంలోని చిన్నగంజాం స్టేషన్ పరిధిలో కడవకుదురులోని పీవీఎస్ ఎంపిపిఎస్ పాఠశాల, అద్దంకి నియోజకవర్గంలోని జె పంగులూరు స్టేషన్ పరిధిలో చందలూరులోని మండల పరిషత్ యుపి పాఠశాల, నూజెల్లపల్లిలోని యుపి పాఠశాల, కొరిసపాడు స్టేషన్ పరిధిలో పమిడిపాడులోని జెడ్పి ఉన్నత పాఠశాల, రావినూతల లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మేదరమెట్ల స్టేషన్ పరిధిలో అద్దంకి రోడ్డులోని జెడ్పి ఉన్నత పాఠశాల, బొడ్డువానిపాలెంలోని యుపి పాఠశాల, అద్దంకి స్టేషన్ పరిధి కాకానిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లోని సమస్యాత్మక పోలీస్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. లైటింగ్, బ్యారికేట్లు ఏర్పాటు చేయించుకోవాలని అన్నారు. పోలింగ్ సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనెల 13న ఎన్నికల కోసం సన్నద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈవీఎం రవాణాకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,510 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. వాటిలో 269 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. భద్రత ఏర్పాట్లను, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లో వెబ్ కాస్టింగ్ ఎలా జరుగుతుంది, లైటింగ్ ఎలా ఉన్నది, క్యూ లైన్‌లు ఎలా ఏర్పాటు చేస్తున్నారనే విషయాలు పరిశీలించారు. స్థానిక పోలీస్ అధికారులకు వివిధ సూచనలు చేసినట్లు తెలిపారు. ఈవీఎంలు రవాణా చేసే సమయంలో గాని, పోలింగ్ సిబ్బంది మీద గాని, పోలింగ్ సమయంలో గానీ ఎవరైనా గొడవలు చేస్తే వారి మీద తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈరోజు సాయంత్రం 6 గంటల నుండి ఎన్నికలు ముగిసేంత వరకు 48గంటల పాటు 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. అభ్యర్థితో కేవలం ఐదుగురితో ఇంటింటికీ తిరగ వచ్చని తెలిపారు. అంతకంటే ఎక్కువ మంది వుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఓటు వేసే వాళ్ళు మాత్రమే ఉండాలని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి వాహనాలను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. అవి కూడా ఆర్ఓ అనుమతి పొందిన మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. వాహనాల్లో ఐదుగురికి మించి ఉండరాదన్నారు. ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించేందుకు అభ్యర్థిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, మాజీ సైనిక్ ఉద్యోగుల సేవలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఈపాటికే రూట్ మొబైల్, క్యూ ఆర్‌టి టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యం, నగదు, ఇతర ఆకర్షకాలను పంపిణీ చేస్తుంటే సి – విజిల్ యాప్ ద్వారా గాని, నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు గాని తెలియచేస్తే వెంటనే చర్య తీసుకుంటామని తెలిపారు. చీరాల డీఎస్పీ బి ప్రసాద్, అద్దంకి సిఐ పి కృష్ణయ్య, రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు పాల్గొన్నారు.

**అద్దంకి :** నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ బూతులను ఎస్‌పి వకుల్ జిందాల్ శనివారం పరిశీలించారు. ఉత్తర అద్దంకి కాకానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు పోలింగ్ బూతులను ఆయన పరిశీలించారు. ఓటర్లకు తాగునీరు, ఎండ దెబ్బ తగలకుండా షామియానా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ జరిగు సమయంలో బూతులకు 200మీటర్ల దూరంలో ఓటర్లు తప్ప ఇతరులు ఉండరాదని అన్నారు. నగదు, మద్యం పంపిణీ జరుగుతున్నట్లు అనుమానం వస్తే పోలీస్ నెంబర్‌కు ఫోన్ చేసినట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానిక అధికారులను అడిగి తెలియని విషయాలు తెలుసుకుని పోలింగ్ సజావుగా జరిగే విధంగా పోలీసులకు సహకరించాలని కోరారు. పోలింగ్ రోజు బూతులు పరిశీలనకు అభ్యర్థులు వాహనాలు వినియోగించు కొనేపనైతే ఒక వాహనంలో పర్మిషన్ ఉన్న ఐదుగురు ప్రయాణించాలని, మూడు వాహనాలకు మించి ఉపయోగించరాదని అన్నారు. కార్యక్రమంలో డిఎస్పి బేతపూడి ప్రసాద్, సిఐ కృష్ణయ్య, ఎస్ఐ నాగరాజు, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, విఆర్ఓ భాష, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు పాల్గొన్నారు.



కాకానిపాలెం బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

## తొలిసారి అవకాశం ఇచ్చిన వైసిపి

**ప్రజాశక్తి - పర్చూరు**



వైసిపి నాయకులు వెంకట్రావు

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి యడం బాలాజీ గురించి ఎన్నికల సందర్భంగా వైసిపి కాపు నాయకులు దాసరి వెంకట్రావు మీడియాతో మాట్లాడారు. పర్చూరు నియోజక వర్గం ఏర్పడిన తరువాత ఒక కాపు అభ్యర్థికి ఎంఎల్ఎగా పోటీ చేసే అవకాశం లభించిందని అన్నారు. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ అవకాశాన్ని కల్పించారని అన్నారు. యడం బాలాజీ ఉన్నత చదువులు చదివిన వ్యక్తని అన్నారు. తాత, తండ్రి నుండి నాయకత్వ లక్షణాలతో నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేసే స్వభావాన్ని అలవరచుకొన్నారని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గడపకు వైసిపిని తీసుకెళ్లారని అన్నారు. వైసిపి చెబడుతున్న ప్రజా సంక్షేమం గురించి ప్రతి వ్యక్తి తెలుసుకొనేటట్లు కష్టపడ్డారని అన్నారు. మళ్లీ ప్రస్తుత ప్రభుత్వమే ఏర్పడాలని కోరారు. బాలాజీని గెలిపించి కాపుల శక్తిని చాటు కోవాలని కోరారు. కరోనా విపత్కర పరిస్థితిలో యడం బాలాజీ ప్రజలకు సేవలు చేశారని అన్నారు. చనిపోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి మట్టి ఖర్చుల కోసం రూ.5వేలు ఇచ్చి సహాయపడ్డారని గుర్తు చేశారు.



ఎన్నికల ప్రచారంలో బెల్లంకొండ దంపతులు

## బెల్లంకొండ దంపతుల ప్రచారం

**ప్రజాశక్తి - పొదిలి**

నగర పంచాయతీలోని కాటూరివారిపాలెంలో టిడిపి కూటమి తరపున బెల్లంకొండ విద్యా సంస్థల కరస్పాండెంట్ బెల్లంకొండ శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఒంగోలు ఎంపిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం ఎంఎల్ఎగా కందుల నారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటూరి నారాయణరావు, పొదిలి పెద్దచెరువు జలాస్ఫూర్తి ప్రదాత మాకినేని వెంకట రమణయ్య, జనసేన లీగల్ సెల్ సంయుక్త కార్యదర్శి ఇనగంటి శైలజ, గంధం నరేంద్ర, వెంకట నారాయణ, వీరానారాయణ, బీసీ నాయకులు యోగయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.




టిడిపి బైక్ ర్యాలీలో కందుల విగ్నేష్‌రెడ్డి

## టిడిపిలో ఉత్సాహం నింపిన బైక్ ర్యాలీ

**ప్రజాశక్తి - పొదిలి**

ఎన్నికల ప్రచారం చివరి రోజు పట్టణంలో టిడిపి ఒంగోలు ఎంపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి విజయం కాంక్షిస్తూ శనివారం భారీ బైక్ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ర్యాలీలో కందుల నారాయణరెడ్డి తనయుడు విగ్నేష్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కాటూరు వెంకట నారాయణ బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, కాటూరి నారాయణ ప్రతాప్, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, పొదిలి మాజీ సర్పంచ్ డాక్టర్ స్వర్ణ గీత, టిడిపి అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖుర్ధూస్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు ఆవులూరి యలమంద, పట్టణ కార్యదర్శి కాటూరి శ్రీను, ఎస్సీ సెల్ నాయకులు జ్యోతి మల్లికార్జునరావు, గజ్జ చిన్నబాబు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్లిం ఓట్లు అడిగే హక్కు టిడిపికి లేదు

**ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మీర్జా షంషీర్ అలిబేగ్**

**ప్రజాశక్తి - మార్కాపురం**

రాష్ట్రంలో టిడిపి బిజెపితో పొత్తు పెట్టుకోవడంతో ఆ పార్టీ పని అయిపోయిందని, ముస్లిం ఓట్లు అడిగే హక్కు కోల్పోయిందని ఎపి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ పేర్కొన్నారు. ముస్లింలకు డాక్టర్ వైఎస్ఆర్ అవకాశం కల్పించిన 4శాతం రిజర్వేషన్ బిజెపి నేతలు ఎత్తివేస్తామని చెప్పడం ముస్లింలు గమనిస్తున్నారని అన్నారు. ముస్లింలకు టిడిపి హయాంలో జరిగిందేమీ లేదన్నారు. సీఎం జగన్‌రెడ్డి కాలంలోనే న్యాయం జరిగిందని అన్నారు. చంద్రబాబు ముస్లిం వ్యతిరేకని చెప్పారు. కులం, మతం, పార్టీ ఎలాంటి వివక్ష చూపకుండా సీఎం జగన్ పాలన చేశారని అన్నారు. వైసిపివైపే మైనారిటీలు ఉన్నారని అన్నారు. 4 ఎంఎల్‌సి, ఈ ఎన్నికల్లో 7ఎంఎల్ఎ సీట్లు మైనారిటీలకు కేటాయించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం అట్టడుగు వర్గాలకు కేటాయించారని అన్నారు. ఉర్దూను 2వ అధికార భాషగా ప్రకటించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మైనారిటీల విద్యా భివృద్ధికి వైసిపి కృషి చేసిందని చెప్పారు. వైసిపి తిరిగి అధికారంలోకి రావడం తథ్యమని చెప్పారు. సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా పనిచేసిన జగన్ ప్రభుత్వం సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిట్లోకి 526కు పైగా ప్రభుత్వ సేవలు తీసుకు వచ్చిందని తెలిపారు. పట్టణంలో రూ.2కోట్లతో షాదిఖానా నిర్మించినట్లు తెలిపారు. రాయవరం వద్ద రూ.500కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశారని అన్నారు. ఇంత మంచి చేసిన జగనన్న మళ్ళీ గెలిపించుకోవాలని చెప్పారు. ఎంఎల్ఎగా అన్న రాంబాబును, ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నజీర్, డాక్టర్ మక్బుల్ భాష పాల్గొన్నారు.



మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మీర్జా షంషీర్ అలిబేగ్

## వైసిపి అభ్యర్థి ప్రచారం

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

మండలంలో వైసిపి చివరి రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుండి ప్రారంభమైన ప్రచార ర్యాలీ ఆరుంబాకలోని వైసిపి కార్యాలయం వరకు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన ప్రచార ర్యాలీలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి డాక్టర్ గణేష్ ప్రజలకు అభివాదం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గాదె మధుసూదనరెడ్డి, కాపు కార్పొరేషన్ నాయకులు అడపా శేషు, ఎంపీపీ రత్న ప్రసాద్, జడ్పిటిసి మర్రివాడ పావని ప్రసాద్, పయనం ఏడుకొండలరెడ్డి, చెన్ను కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో డాక్టర్ గణేష్, మోపిదేవి వెంకటరమణ

## ప్రారంభమైన ఓట్ల కొనుగోళ్లు

**తటస్థులకు మాత్రమే ఓటుకు రూ.2వేలు పంపిణీ**

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**


ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా ముగిసింది. పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునే కార్యక్రమం వాడివేడిగా జరుగుతుంది. మండలంలో మొదటగా టిడిపి నుండి ఓటుకు రూ.2వేల చొప్పున పంపిణీ ప్రారంభించినట్లు ప్రచారం జరిగింది. తరువాత వైసిపి రూ.2వేల చొప్పున పంపిణీ చేశారనే ప్రచారం ఊపందుకుంది. ఇరు పార్టీలు తటస్థంగా ఉన్న ఓటర్లకు, వారి సొంత అభిమానులకు మాత్రమే పంపిణీ చేసి ప్రత్యర్థి పార్టీలకు చెందిన వారికి పంపిణీ చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో డబ్బు అందలేదని నాయకుల చుట్టూ ఓటర్లు తిరుగడంతో ఆ నాయకులు ముఖం చాటేశారని బహిరంగంగానే చర్చిస్తుననారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలో అత్యధిక శాతం నగదు ఓటర్లకు పంపిణీ చేసినట్లు సమాచారం. ప్రతి గ్రామంలో అధికార పార్టీ నాయకులు వాలంటీర్లు సహకరించగా ప్రతిపక్ష పార్టీకి ఇతర గ్రామాల నుండి వచ్చిన వాళ్లు ఓటర్ల జాబితా ప్రకారం నగదు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా ఇద్దరు అభ్యర్థుల వద్ద డబ్బు తీసుకున్న ఓటర్లు ఎవరికి ఓటేస్తారోనని తలలు పట్టుకుంటున్నారు.

## అమలులో 144వ సెక్షన్

**ప్రజాశక్తి - నగరం**

ఎన్నికల నేపథ్యంలో నేటి నుండి 144సెక్షన్ అమలులోకి వస్తుందని సభలు, సమావేశాలు నిషిద్ధమని ఎస్ఐ కోటేశ్వరావు విలేకరులకు తెలిపారు. ఈనెల 13న ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డబ్బు, మద్యం, గిఫ్టులకు ప్రభావితం కావద్దని నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఓటింగు సందర్భంగా ప్రజలు గుమి కూడవద్దని అన్నారు. దుకాణదారులు స్వతహాగా షాపులు మూసివేసి సహకరించాలని కోరారు. పోలింగ్ బూత్‌లకు 100 మీటర్ల దూరంలోపు మొబైల్ ఫోన్లు అనుమతిలేదని అన్నారు. ఎలక్షన్ కమిషన్ అనుమతి ఉన్న పాత్రికేయులు మాత్రమే బూత్ వద్దకు అనుమతి వుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న అజితారావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి బూదాల అజితారావు అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలో శనివారం ఆమె రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు వైసిపి ఐదేళ్ల కాలంలో ఏ విధంగానూ మేలు చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఎంఎల్ఎగా గెలిపించాలని కోరారు. ఇండియా వేదిక అధికారంలోకొస్తే ఇల్లు లేని పేదలకు రూ.ఐదు లక్షలతో ఇల్లు కట్టించి ఇస్తామన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.400 కనీస వేతనం అమలు చేస్తామన్నారు. కేంద్రంలో మళ్లీ బిజెపి అధికారంలోకొస్తే ఏ ఒక్క సంస్థ కూడా ప్రభుత్వ రంగంలో మిగలకుండా ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీ చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. రైల్వే, విద్యుత్, విమానాశ్రయాలు, ఆయిల్, గ్యాస్ వంటివి ప్రయివేట్ కంపెనీలకు ధారాదత్తం అవుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈపాటికే రెండుసార్లు పోటీ చేసి తీవ్రంగా నష్టపోయానని చెప్పారు. అయినా యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని మంచి చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఆశీర్వదించి గెలిపించాలని కంటనీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, వెంకటరెడ్డి, నాసరయ్య, సూరి, పుచ్చకాయల వెంకటేశ్వర్లు చౌదరి, విజయకుమార్, సిపిఎం నాయకులు డికెఎం రఫీ, దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, సిపిఐ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**పెద్దదోర్నాల:** పెద్దదోర్నాల మండలంలోని గంటావానిపల్లి, యడవల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పెద్దదోర్నాల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బూదాల అజితారావు మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని అన్నారు. శాశ్వత పనులను చేపడతానన్నారు. తాగు, సాగు నీరు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానన్నారు. ఆశీర్వదించి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రాజయ్య యాదవ్, నాయకులు జబ్బార్, ప్రకాష్, సుబ్బారెడ్డి, మల్లయ్య, సిపిఎం నాయకులు డికెఎం రఫి, దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం




ఎన్నికల అధికారి శ్రీలేఖ

ఎన్నికల నియమావళిని ప్రజలు పాటించాలని యర్రగొండ పాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ అన్నారు. శనివారం ఆమె కార్యాలయంలో మాట్లాడు తూ ఎన్నికలలో 48 గంటల ముందు, ఎన్నికల తర్వాత పాటించాల్సిన నియమ నిబంధనలను వివరిం చారు. ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసులకు, ఎన్నికల సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాహనాలను పూర్తిగా తనిఖీ చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు.



కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్న షేక్ కాలేషా

## 'మద్దులూరి'పై కలెక్టరుకు ఫిర్యాదు

ప్రజాశక్తి-వేటపాలెం

దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వీడియోను చిత్రీకరించి ప్రసార మాధ్యమాలలో ప్రసారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. చీరాల టిడిపి అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్యపై జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం-2016 సెక్షన్ 92 (ఎ) ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. ఈ వీడియోలో ఒకరు అంధుడిగా నటించే క్రమంలో ఒక సకలాంగుడి పాత్ర పోషిస్తున్న వ్యక్తి అతడిని ఒరేయ్ గుడ్డోడా.. ఇటు రారా.. అని పిలుస్తూ గేలిచేయటం తనను తీవ్రంగా బాధించిందని అన్నారు. ఈ విషయాలన్నిటిపై సమగ్ర పరిశీలన, విచారణ చేసి చీరాల టిడిపి అభ్యర్థి మద్దులూరి మాల కొండయ్య మీద జాతీయ దివ్యాంగ హక్కుల చట్టం-2016 సెక్షన్ 92 (ఎ) కింద కేసు నమోదు చేయాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను పరిష్కరిస్తాలన్నీ హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో జిల్లా కార్యదర్శి పి అనిల్ నాయుడు, మహ మ్మద్ సలేహా, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలో చేరిక

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డు నల్లబండ బజార్‌కు చెందిన దాదాపు 30 కుటుంబాలు 18వ వార్డు కౌన్సిలర్ షేక్షావలి, మహిళ నాయకురాలు రాణి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైసీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వైసీపీ సంక్షేమ పాలనకు ప్రతి ఒక్కరూ మరలా వైసీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సోమవారం జరిగే ఎన్నికలలో గెలిచేది వైసీపీయే అని, తామంతా ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయానికి కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## వైన్ షాపుల ముందు మందుబాబుల బారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మద్యం షాపు వద్ద గుమిగూడిన మందుబాబులు

జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపులకు 48 గంటల పాటు డ్రైడేగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో శనివారం ఉదయం నుంచి యర్రగొండ పాలెం పట్టణంలోని మద్యం షాపుల దగ్గర మందుబాబులు బారులు తీరారు. సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం షాపులు మూతపడనున్నాయి. దీంతో మందుబాబులు వైన్ షాపుల ముందు క్యూలో గంటల తరబడి నిలబడి మద్యం సీసాలను అట్టపెట్టెల్లో, జేబుల్లోనూ, రెండు చేతులతోనూ పట్టుకొని వెళ్లిపోతున్నారు. కాగా కొన్ని మద్యం షాపుల్లో స్టాక్ అయిపోయిందని చెప్పి మందుబాబులను వెనుకకు పంపి వేస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో బాటిల్‌పై రూ.50 నుంచి రూ.70 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అయినా మందుబాబులు గత్యంతరం లేక అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో తీసుకోక తప్పడం లేదని వాపోతున్నారు.

# 144 సెక్షన్ అమలు

- ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: ఎస్‌పి

ప్రజాశక్తి-వేటపాలెం



ఓ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

144 సెక్షన్ అమలులో ఉన్నందున అయిదుగురికి మించి గుంపులుగా తిరగరాదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ హెచ్చరించారు. శనివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. చీరాల నియోజకవర్గం వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో వున్న ఎంపీపీ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉన్న సమస్యాత్మక పోలీస్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, తగిన లైటింగ్, బ్యారికేటింగ్ ఏర్పాటు చేయించుకోవాలని తెలిపారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ నెల 13న సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం బాపట్ల జిల్లాలో పోలీస్ శాఖ అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉన్నదని తెలిపారు. ఈవీఎం రవాణా కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,510 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 269 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలలోని కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. అక్కడ తీసుకుం టున్న భద్రత ఏర్పాట్లు తదితర విషయాలను పరిశీలించి స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈవిఎంలు రవాణా చేసే సమయంలోనూ, పోలింగ్ సమయంలోనూ సిబ్బందిపై ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికలు ముగిసేంత వరకు 48 గంటల పాటు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉండటం వలన ఐదుగురుకు మించి ఎవరూ గుంపులుగా తిరగరాదని అన్నారు. అభ్యర్థి డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించుకోవచ్చునన్నారు. అయితే అభ్యర్థితో పాటు మొత్తం ఐదుగురు మాత్రమే ఉండాలన్నారు. అంతకంటే ఎక్కువ మంది ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునేవారు మాత్రమే ఉండాలన్నారు. ఇతరులకు, వాహనాలకు అనుమతి లేదన్నారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థి వాహనాలను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. అవి కూడా ఆర్వో అనుమతి పొందిన మూడు వాహనాలు మాత్రమే అనుమతి స్తారని, వాహనాలలో ఐదుగురికి మించి ఉండరాదని అన్నారు. ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించేందుకు అభ్యర్థిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్ రోజున ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ఎక్స్ ఆర్మీ వ్యక్తుల సేవలను పోలింగ్ కేంద్రాల వద్ద ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రూట్ మొబైల్, క్యూఆర్ టీ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లను ఏర్పాటు చేశామని, వీరు సమన్వయంతో పనిచేస్తూ అన్ని ప్రాంతాలను కవర్ చేసేలాగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మద్యం, నగదు, ఇతర ఆకర్షణలను పంపిణీ చేస్తుంటే సి విజిల్ యాప్ ద్వారా లేదా నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియచేయడం వలన వెంటనే చర్య తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బి ప్రసాద్, అద్దంకి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి కృష్ణయ్య, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు తదితరులు వున్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సిరాజ్

## వెంకటేష్‌ను గెలిపించుకుందాం: సిరాజ్

**ప్రజాశక్తి-చీరాల:** చీరాల నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను ముస్లిం మైనార్టీలందరూ సంపూర్ణ మద్దతు తెలియజేసి గెలిపించాలని బ్రదర్ సిరాజ్ అన్నారు. శనివారం వీవర్స్ కళ్యాణ మండపంలో జరిగిన ముస్లింల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో సిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రేపు రాబోయే ఎలక్షన్స్ లో మన యొక్క ఓటును వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి అయిన వెంకటేష్ బాబుని గెలిపించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, సలీం, అల్లాబక్షు, జిలాని, పేరాల జిలాని, అక్బర్ సంపత్ నగర్, మస్తాన్ బాషా, సంధాని, కాలేషా, ఆలీ, ముస్లిం కోఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, కొత్తపేట బాషా, షేక్ సుభాని, చీరాల పట్టణ ముస్లిములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భారాలు మోపిన ప్రభుత్వం

## ఇండియా వేదిక ప్రచార కార్యక్రమంలో నాయకుల ధ్వజం

**ప్రజాశక్తి-వేటపాలెం**

ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపిందని ఇండియా వేదిక నాయకులు విమర్శించారు. శనివారం మండల పరిధిలోని పందిళ్లపల్లిలో జరిగిన ప్రచార సభలో పలువురు నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిపాటి బాబురావు, దళిత నాయకులు మాచవరపు జూలియన్, సిపిఎం నాయకులు పి కొండయ్య, సిపిఐ నాయకులు సామేలు, మేరిక రమేష్‌బాబు తమ ప్రసంగాలలో వైసిపి తీరుపై ధ్వజమెత్తారు. స్థానికుడైన ఆమంచి కృష్ణమోహన్‌ను చీరాల శాసనసభకు గెలిపించాలని, బాపట్ల పార్లమెంట్‌కు జెడి శీలంను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 2009 నుంచి 2014 వరకు ఆమంచి కృష్ణమోహన్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి చీరాల అభివృద్ధికి తోడ్పడ్డారని అన్నారు. 2019 నుంచి బలరామకృష్ణమూర్తి చీరాల అభివృద్ధికి తిలోదకాలు ఇచ్చారని, అభివద్ధి కార్యక్రమాలు లేవని, అందువల్ల చీరాలలో స్థానికుడైన కృష్ణమోహన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం విపరీతంగా ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందని, కరెంటు చార్జీలు పెంచిందని అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి రాష్ట్రంలో పరిస్థితి తయారైందని వారు విమర్శించారు. గ్యాస్ రేటు 400 నుంచి 1200 వరకు పెంచి ప్రజల నడ్డి విరిచారని, అన్ని రకాల పందుల పిచ్చారని అందువల్ల భారాల వైసీపీని ఓడించాలని కష్టం గుర్తుకు ఓడి చేయాలని హస్తం గుర్తుకు ఓటు చేయాలనికూడా వారు విజ్ఞప్తి చేశారు రామానగర్, వేటపాలెం, దేశాయిపేట, ఆమోదగిరి పట్నం, జాంద్రపేట, రామకష్ణాపురం గ్రామాలలో వరుసగా సభలు జరిగాయి.


పందిళపల్లి గ్రామంలో మాట్లాడుతున్న ఇండియా వేదిక నాయకులు

## పొగాకు బేళ్ల అమ్మకం

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి శనివారం కూనంనేనివారిపాలెం గ్రామ రైతులు 1091 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 925 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 156 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.299 పలుకగా అత్యల్ప ధర రూ.205 పలికింది. సరాసరి కిలో ధర రూ.271.35 పలికింది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.


ప్రచారం చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి జయరాజ్

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**

బహుజన సమాజ్ పార్టీకి ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని గిద్దలూరు నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి ఇసుకల జయరాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె, నరవ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ఇంటింటినీ సందర్శించి రాజ్యాంగాన్ని రూపుమాపా లనుకునే, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలనుకునే పార్టీలను నమ్మవద్దని ఆ పార్టీలకు ఓటు వేసి దగా పడవద్దని, ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ శక్తుల కోసం, ధనవంతుల కోసం ప్రాకులాడే వారికి ఓట్లు వేసి చట్ట సభలకు పంపిస్తే రాబోయే రోజుల్లో ప్రజలు అనేక కష్టాల పాలవుతారని, కాబట్టి ప్రజలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బహుజన ప్రజల కోసం పనిచేసే బహుజన్ సమాజ్ పార్టీ ఏనుగు గుర్తుపై ఓటు వేయాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ అంకమ్మరావు అన్నారు. శనివారం పెద్దదోర్నాల పట్టణంలో సిఆర్‌పిఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని అన్నారు. పోలీసులు భద్రత కల్పిస్తారనే ఆలోచన ప్రజల్లో కల్పించే ఉద్దేశంతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలకు అంతరాయం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అందరూ ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కావవద్దని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించువాలని కోరారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, సిఆర్‌పిఎఫ్ బలగాలు పాల్గొన్నారు.


విద్యార్థులను సత్కరిస్తున్న సిబ్బంది

## ప్రతిభకు పట్టాభిషేకం

**ప్రజాశక్తి-వేటపాలెం**

చీరాల నియోజకవర్గ స్థాయిలో 2024 మార్చి పదో తరగతి పరీక్షలలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారికి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్, పందిళ్లపల్లిలో 577/600 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన ములకల శ్యామల, 575/600 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన కోనంకి భార్గవ్, 567/600 మార్కులతో తృతీయ స్థానం సాధించిన ఆసోది హర్ష, వంగర రోహిణి చైతన్య, సజ్జా శివసాయి శ్రావణ్ లను మెమొంటో, శాలువా, జనరల్ నాలెడ్జ్ పుస్తకం, సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 'మానవత' స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ బండారుపల్లి హేమంత్ కుమార్, అధ్యక్షులు ఏ నాగవీరభద్రాచారి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, బుద్ధి మోహనరావు, గుంటూరు శివశంకర్ పాల్గొన్నారు. అనంతరం భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


ప్రచారంలో కుందురు నాగార్జునరెడ్డి

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా: కుందురు

**ప్రజాశక్తి-గిద్దలూరు**

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ప్రతి ఒక్కరూ ఓటు వేసి వేయించి గెలిపించాలని గిద్దలూరు వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి అభ్యర్థించారు. శనివారం గిద్దలూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కుందురు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మొదటగా గాంధీబొమ్మ సెంటర్‌లోని వినాయక గుడిలో కుందురు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం గిద్దలూరు పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి అమ్మవారిశాల బజార్, గణేష్ నగర్, చిన్న మార్కెట్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో జగనన్న బలపరచిన వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముందుగా పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ గజమాలతో నాగార్జునరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివపురం సురేంద్ర కుమార్, ఎంపీపీ కడప లక్ష్మి, వైస్ చైర్మన్లు ఆర్‌డి రామకృష్ణ, కాతా దీపిక, చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బండారు నిర్మల, పెండేల కిరణ్, పోలేపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీతో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు: వెంకటేష్

**ప్రజాశక్తి-చీరాల**

ప్రశాంత వాతావరణంలో చీరాల నియోజకవర్గ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్రం కల్పిస్తూ నియోజవర్గ సమస్యలను అన్నివేళలా పరిష్కరిస్తూ ప్రజలకు అండగా ఉన్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారం చివరి రోజు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చీరాల నుంచి ఈపురిపాలెం వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేష్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా ఇంటి వద్దకే అందేలా వాలంటీర్ వ్యవస్థ ద్వారా, సంక్షేమ పథకాలు లబ్ధిదారుని ఖాతాలో జమ అయ్యేలా చేసిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలందరూ వారి అమూల్యమైన ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, వైసీపీ సీనియర్ నాయకులు బిట్రా శ్రీనివాసరావు, దామర్ల శ్రీకృష్ణ, గోలి ఆనందరావు, పాలపర్తి నాగేశ్వరరావు, గుద్దంటి సుధాకర్, డిఎస్ఆర్ హ్యాండ్లూమ్స్ అధినేత దామర్ల శివయ్య, బాల హ్యాండ్లూమ్స్ అధినేత బాల, ముట్టే తదితర నాయకులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వెంకటేష్, నందిగం సురేష్ సురేష్

## చంద్రబాబును కలిసిన కోలా ప్రభాకర్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**



చంద్రబాబుతో ప్రభాకర్

రాష్ట్రంలో కాపుల సంక్షేమం కోసం రూ.15 వేల కోట్లు బడ్జెట్లో కేటాయిస్తానని మేనిఫెస్టో ప్రకటించినందుకు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఫౌండర్, జనరల్ సెక్రటరీ కోలా ప్రభాకర్ కలిసి.. కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 80 శాతం మంది కాపులు చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చూడాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.



పోషకాహారం, దుస్తులు అందజేస్తున్న థామస్

## బాధితులకు పోషకాహారం అందజేత

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ.. భర్త చనిపోయిన బాధితులకి ఫౌండేషన్ తరపున అవసరమైన న్యూట్రీషియన్ ఫుడ్‌తో పాటు దుస్తులను ఎంఎంఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఎంఎంఆర్ పౌండేషన్ ఛైర్మన్, ఎన్‌హెచ్ఆర్‌పి ఎస్‌సి ఎస్‌టి సెల్ రాష్ట్ర ఇన్‌ఛార్జి థామస్ మక్కెన ఆధ్వర్యంలో ఒంగోలులోని శర్మా కాలేజి దగ్గర ఎంఎంఆర్ ఫౌండేషన్ ఆఫీస్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎన్‌హెచ్ఆర్‌పి జిల్లా జనరల్ సెక్రటరీ షేక్ సర్దార్, షేక్ అబ్దుల్ జబ్బార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా థామస్ మక్కెన మాట్లాడుతూ తామందరం కలిసి ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. షేక్ సర్దార్ మాట్లాడుతూ థామస్ ఒంటరిగా చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు తమకు చాలా ఇన్స్పైరింగ్‌గా అనిపించాయని, ఇక నుండి ఫౌండేషన్ తరపున జరిగే అన్ని సేవా కార్యక్రమాలలో థామస్‌తో కలిసి నడుస్తామని తెలిపారు.

## దళితులను దగా చేసిన జగన్‌రెడ్డి: మల్లెల

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**



మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

దళితులను దగా చేసిన ద్రోహి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మల్లెల వెంకట్రావు ధ్వజమెత్తారు. ఈనెల 13న జరిగే ఎన్నికలలో టిడిపి-బిజెపి-జనసేన పార్టీల కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. స్థానిక ఎంసిఎ భవన్‌లో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా దళితులకు రావాల్సిన సంక్షేమం పథకాలను జగన్ నిర్వీర్యం చేశారన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, అంబేద్కర్ స్టడీ సర్కిల్, భూమి కొనుగోలు పథకం, ఎన్సీ కార్పొరేషన్ రుణాలు రద్దు చేశారన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని, ఎస్‌సి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనకు ఇచ్చే సబ్సిడీని నిలుపుదల చేశారని, కులాంతర వివాహాలకు ఇచ్చే ప్రోత్సాహకాలు ఆపివేశారన్నారు. కార్మిక సంక్షేమ పథకం రద్దు, చంద్రన్న బీమా రద్దు. ఎస్‌సి, ఎస్‌టి కారుణ్య నియామకాలు నిలిపివేశారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలలో రిజర్వేషన్లు అమలు చేయటం లేదన్నారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్ బట్టలు ఊడదీయించి పిచ్చివానిగా ముద్ర వేసి చనిపోయేలా చేశారున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 72 మంది మాలలు హత్యకు గురయ్యారన్నారు. ఈ నేపథ్యంలో వైసిపికి మాలలు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎస్‌సి, ఎస్‌టిలకు మేలు జరిగిందని, వచ్చే ఎన్నికలలో టిడిన అభ్యర్థులకు మాలలు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు.

# సేవకు మారు పేరు నర్సులు

## జిజిహెచ్‌లో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**



నర్సుల దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ దుర్గాదేవి

సేవ అనేదానికి మారుపేరు నర్సులని, 90 శాతం రోగులకు సేవ కేవలం నర్సెస్ ద్వారా మాత్రమే అందుతుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ఏడుకొండలరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాదేవి అన్నారు. లాంప్ అఫ్ ది లైట్‌గా ప్రఖ్యాతిగాంచిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని మే 12న అంతర్జాతీయ నర్సస్ డేగా జరుపుకుంటారు. అందులో భాగంగా ఒంగోలులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ముందస్తుగా శనివారం నర్సెస్ డే వేడుకలు ఆంధ్రప్రదేశ్ గవర్న మెంట్ నర్సెస్ అసోసియేషన్, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌తో పాటు సియస్ ఆర్ యంఓ డాక్టర్ హనుమంతరావు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు మాట్లాడుతూ నర్సెస్ వైద్యరంగంలో వెన్నెముక లాంటి వారని, వారి సేవలు వర్ణనా తీతం అని కొనియాడారు. ఈ సందర్భంగా కోవిడ్ లో చనిపోయిన నర్సులకు నివాళిగా మౌనం పాటించారు. వేడుకల సందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొన్న నర్సులకు సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ ద్వారా బహుమతులు అందచేశారు. కార్యక్రమానికి నర్సెస్ యూనియన్ సెక్రటరీ మంజేష్ అద్యక్షత వహించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ బి. సంపూర్ణమ్మ, సి.హెచ్.అనంతలక్ష్మి, యూనియన్ నాయకులు ఉదయ లక్ష్మి, వందన, విజయ్ కుమార్, రమణానాయక్, మహేష్, కళ్యాణ్, హాజన్‌నాయక్, హనుమంత్ పాల్గొన్నారు.

**సూపరింటెండెంట్‌కు అభినందనలు**

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జి.దుర్గాదేవిని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అభినందనలు తెలియజేశారు. స్థానిక జిజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శనివారం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు, కార్యదర్శి కె.శ్రీధర్ బాబు సూపరింటెండెంట్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డాక్టర్ జి.దుర్గా దేవి జిజిహెచ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.



ప్రచారంలో మాగుంట, దామచర్ల కుటుంబసభ్యులు

## 34వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఎన్నికలలో టిడిపి-బిజెపి-జనసేన పార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాగుంట, దామచర్ల కుటుంబ సభ్యులు ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 34వ డివిజన్‌లో బుధవారం వారు ఇంటింటి ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ద్వారానే సాధ్యమన్నారు. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మరదలు శశికళ, సురేఖ రెడ్డి, చెల్లెలు సంధ్య, హితా రెడ్డి, మేనకోడళ్ళు ప్రణతి, కీర్తి, మనవరాలు జాహ్నవి పాల్గొన్నారు. అదేవిధంగా దామచర్ల జనార్ధనరావు అక్క మాధవి, కుమార్తె అనిషా లక్ష్మి, మరదలు డాక్టర్ హిమ బిందు, కోడలు హారిక, వారి కుటుంబ సభ్యులు ఆత్మకూరి బ్రహ్మయ్య, పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

## జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

ప్రశాంత వాతావరణంలో బాపట్ల జిల్లాలో ఎన్నికలు నిర్వహించడానికి సంసిద్ధమయ్యామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. పౌరులు స్వేచ్ఛగా ఓటు వేయడం కోసం 120 శాతం పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. 12వ తేదీన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ యంత్రాలు, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు పంపుతామన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా సాయంత్రం నుంచి తమ ప్రచారాలను నిలిపివేయాలన్నారు. హోర్డింగులు, పార్టీ గుర్తులు, కరపత్రాలతో ప్రచారాలు చేయరాదన్నారు. ఎన్నికల సమయంలో ఎగ్జిట్ పోల్స్ ప్రచురణ, ప్రసారాలు నిషేధమన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి మూడు వాహనాలు అనుమతిస్తామన్నారు. ఒక్కొక్క వాహనంలో ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని, అలా చేసినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారి రంజిత్ బాషా చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఎఫ్ఎస్‌టి, ఎస్-ఎస్‌టి టీమ్‌లు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.5.30 కోట్ల విలువచేసే మద్యం, బంగారం, వెండి ఆభరణాలు, బహుమతులు, ప్రచార సామగ్రి, తదితరమైన వాటిని సీజ్ చేశామన్నారు. సి-విజిల్ యాప్‌లో వచ్చిన 735 ఫిర్యాదులను 32 నిమిషాల్లోనే పరిష్కరిస్తున్నామని చెప్పారు. కోడ్ ఉల్లంఘించిన నలుగురు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశామని, 31 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, 42 మంది వాలంటీర్లను తొలగించామన్నారు.

రాజ్యాంగం కల్పించిన ఏంతో విలువైన ఓటు హక్కును పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గత ఎన్నికలలో సుమారుగా 86 శాతం ఓటింగ్ జరగ్గా, ప్రస్తుతం మరింత పెరగాలన్నారు. ఓటర్లు చైతన్యవంతులై ఖచ్చితంగా ఓటు వేయాలని ఆయన సూచించారు. వద్ధులు, దివ్యాంగుల కొరకు సక్షం యాప్ అమల్లోకి వచ్చిందని, ముందస్తుగా నమోదు చేసుకున్నవారికి వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికలు సమీపించినందున ఈసిఐ డ్రైడేగా ప్రకటించడంతో మద్యం విక్రయాలను నిలిపివేశామని కలెక్టర్ చెప్పారు. రెండు వాహనాలు స్వాధీనం చేసుకోగా, లౌడ్ స్పీకర్ పై 9 కేసులు, అక్రమ మద్యంపై 14కేసులు, మరో 19 మంది మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. పోలింగ్ రోజున బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపినా, ముందస్తు అనుమతి లేకుండా పత్రికలలో ముద్రించడం, టీవీ ఛానల్స్‌లో ప్రసారాలు చేసినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. 1,030 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసి కలెక్టరేట్ నుంచి నిఘా ఉంచుతామన్నారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ యంత్రాలు ఒంగోలులోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరుస్తారన్నారు.

### 10 వేల మందిని బైండోవర్ చేశాం..

**ఎస్పీ వకుల్ జిందాల్**

ఎన్నికల సమయంలో బాపట్ల జిల్లాలో గొడవలు, అల్లర్లు నియంత్రణకు పది వేల మందిని బైండోవర్ చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు అయిదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడరాదన్నారు. అక్రమ మద్యం, నగదు, బహుమతులతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా పోలీస్ పెట్రోలింగ్ టీమ్ లు సంచరిస్తాయన్నారు. మిగిలిన టీమ్ లు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. రానున్న 48 గంటలలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని పోలీస్ బలగాలే గాకుండా తమిళనాడు రాష్ట్రం నుండి 250 మంది పోలీసులు, 5 బిఎస్ఎఫ్, 3 టిఎస్ఎస్‌పి, 1 ఐటిబిపి కంపెనీల సాయుధ బలగాలు జిల్లాలో విధులు నిర్వహిస్తాయన్నారు. జిల్లాలో మొత్తం 913 పోలింగ్ ప్రాంతాలలో 1,510 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. 269 ప్రాంతాలలో 337 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. గతంలో జరిగిన గొడవలు, ఇతర అవాంఛనీయ ఘటనలను దష్టిలో ఉంచుకుని, అదనంగా పోలీసు బందోబస్తు నియమించామన్నారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రితో వెళ్లే పోలింగ్ సిబ్బందికి సాయుధ బలగాలు ఎస్కార్ట్ గా వెళ్తాయని ఎస్పీ చెప్పారు. పోలింగ్ తదుపరి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్ లోకి వెళ్లేంతవరకు అత్యధిక ప్రాధాన్యత కింద ఎస్కార్ట్ ఉంటుందన్నారు. వీరి భద్రతకు ఏటువంటి ఆటంకం కలుగకూడదు, ఒకవేళ ఈ రెండు రోజులు ఎవరైనా ఎక్కడైనా గొడవలకు పాల్పడినా, ఈవీఎంలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించినా, పోలింగ్ సిబ్బందిపై గొడవలకు, దౌర్జన్యానికి పాల్పడితే వారిపై అత్యంత తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ జరిగే రోజున పోలీస్ సిబ్బందితోపాటు ఎన్ఎస్ఎస్, ఎన్.సి.సి., మాజీ సైనికులు పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యం: బూచేపల్లి

**ప్రజాశక్తి-దర్శి**

పేదల సంక్షేమమే వైసిపి లక్ష్యమని ఆ పార్టీ దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. తాళ్లూరు మండలం, తూర్పు గంగవరం గ్రామానికి చెందిన హసన్‌బాషా, హర్షిద్, కలాం, హర్షఫ్, రఫీ శనివారం వైసిపిలో చేరారు. బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి వారికి కండువాలు కప్పి.. పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీల కోసం వైసిపి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల భూములను దోచుకునేందుకే..

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చింది అందుకే..!
- యాక్ట్ ప్రతులను తగలబెట్టిన ఎమ్మెల్యే ఏలూరి



ప్రచారంలో భాగంగా ఏలూరికి హారతులిస్తున్న మహిళలు

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

బిజెపి పాలిత రాష్ట్రాలతో సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేయలేదని, ప్రజల భూములను దర్జాగా దోచుకునేందుకు వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని టిడిపి-జనసేన-బిజెపి కూటమి పర్చూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 512 జీవో కాపీలను ఎమ్మెల్యే ఏలూరి దహనం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక ముఖ్యమంత్రి రైతులకు సంబంధించిన భూముల పత్రాలపై ఫొటోలు వేయించుకున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రైతుల భూములపై సీఎం ఫొటోలు ఎందుకని ఏలూరి ప్రశ్నించారు. భూములు కబ్జా చేసేందుకు సివిల్ కోర్టులు అడ్డంకిగా ఉన్నాయని, కోర్టుల రక్షణను తొలగించడానికి రెవిన్యూ అధికారులకు సివిల్ కోర్టుల అధికారాలని కట్టబెడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం తీసుకు వచ్చారన్నారు. జగన్ రెడ్డి బినామీ కంపెనీ ఇండోసోల్ కంపెనీకి ఒక్క రామాయపట్నం పరిసరాల్లోనే 8500 ఎకరాల రైతుల భూముల్ని కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రమంతా విస్తరించిన జగన్ భూ మాఫియా లక్షలాది ఎకరాలు కబ్జా చేయడానికి ఈ చట్టం తీసుకొచ్చారని ఆరోపించారు.

– అనంతరం పలు చోట్ల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు.

# 70 కుటుంబాలు టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి-అద్దంకి**



టిడిపిలో చేరిన వారితో గొట్టిపాటి రవికుమార్

పట్టణంలో 8వ వార్డు శ్రీరామ్ కాలనీ చెందిన 70 కుటుంబాల వారు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గొట్టిపాటి రవి కుమార్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి గొట్టిపాటి రవికుమార్ పార్టీ కండువాలు కప్పి.. ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**సంతమాగులూరు:** ఏల్చూరు గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ టిడిపి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి.. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తేనేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.

# అవకాశం ఇవ్వండి..అండగా ఉంటా..

టిడిపి అభ్యర్థి కొండయ్య

**ప్రజాశక్తి-చీరాల**

చీరాల నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గం ప్రజలకు అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం పలు చోట్ల ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా 5వ వార్డ్ కౌన్సిలర్ సురగాని లక్ష్మి, నరసింహారావు దంపతులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కార్యక్రమంలో భాగంగా ఆయన నియోజకవర్గ కూటమి ముఖ్య నేతలతో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సినీ హీరో సిద్ధార్థ నిఖిల్, కొండయ్య తనయుడు గౌరీ అమర్నాథ్ సముద్ర తీర ప్రాంతాలలో ఉన్న మత్స్యకారులతో మాట్లాడారు. టిడిపి నుండి పోటీలో ఉన్న తన మామయ్య కొండయ్యకు ప్రజలు అందరూ సంపూర్ణ మద్దతు తెలియజేసి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో గొడుగుల గంగరాజు పాల్గొన్నారు.



ప్రచారంలో సినీ హీరో నిఖిల్

# అబద్ధాల కోరు జనార్ధన్

- బ్యాంకులను మోసం చేసి ఆస్తులు పోగేసుకున్నాడు
- అధికారంలోకి వచ్చాక నీ సంగతి తేలుస్తా..
- ఒంగోలు ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి బాలినేని వ్యాఖ్యలు



ఒంగోలులో బాలినేని ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న బాలినేని

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

'నీ మీద 19 కేసులు ఉన్నాయి... రూ.100 కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టావు.. బ్యాంకులకు ఎగ్గొట్టిన డబ్బులతో ఆస్తులు పోగేసుకున్నావు. ఎంతో మందికి అప్పులున్నావు. అప్పులు వాళ్లు అడిగితే బెదిరిస్తున్నావు. నిత్యం అబద్ధాలు చెబుతూ మా మీద దుష్ప్రచారం చేస్తున్నావు. మళ్లీ ప్రభుత్వం వస్తే నీ సంగతి తేలుస్తా' అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే, వైసిపి ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌ను హెచ్చరించారు. శనివారం ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా స్థానిక మంగమూరు రోడ్డు బైపాస్‌లో ఆయన మాట్లాడారు. ముందుగా మంగమూరు రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసి, అక్కడ నుంచి మంగమూరు రోడ్డు బైపాస్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ కార్యకర్తల నుద్దేశించి మాట్లాడారు. తెలుగుదేశంపార్టీ ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. జనార్ధన్ బ్యాంకులను మోసం చేశారని ఆరోపించారు. ఇటీవల సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో రూ.110 కోట్లు ఆస్తులున్నట్లు జనార్ధన్ చూపించారని, ఆ డబ్బులు బ్యాంకులకు కట్టవచ్చు కదా.? అని హితవు పలికారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన చంద్రబాబు నాయుడు జనార్ధన్ రాసిఇచ్చిన స్క్రిప్ట్ చదివారని పేర్కొన్నారు. తాను యరజర్ల కొండమట్టి తవ్వుకొని రూ.40 కోట్లు సంపాదించానని చెప్పారని, ఒక్క రూపాయి సంపాదించుకున్నట్లు నిరూపించినా తాను వారు ఏం చెప్పినా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. తాను ఏడుసార్లు ఎన్నికల్లో పోటీ చేశానని, తనపై పోటీ చేసిన వారు ఎవ్వరు కూడా ఇంత దిగజారుడు ఆరోపణలు చేయలేదని పేర్కొన్నారు. మంచితనానికి కూడా ఓ హద్దు ఉంటుందని, హద్దులు దాటి మాట్లాడవద్దని జనార్ధన్‌కు సూచించారు. ఒంగోలు నియోజకవర్గంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి చేశానని చెబుతున్నాడని, తాను గత ఐదేళ్ల కాలంలో రూ.4 వేల కోట్లతో అభివృద్ధి చేశానని బాలినేని గుర్తు చేశారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు నాయుడు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని చెప్పారు. ఆయన్ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసేదే చెబుతాడని, చెప్పింది చేస్తాడని వివరించారు. ఆరోసారి తనను ఒంగోలు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో గెలిస్తే కార్యకర్తల రుణం తీర్చుకుంటానని చెప్పారు. ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని హామి ఇచ్చారు. ఎన్నికల ప్రచారం ముగింపు ర్యాలీలో వైసిపి ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొద్దిదూరం పాల్గొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్లు వేమూరి బుజ్జి, వెలనాటి మాధవరావు, వైసిపి నగర అధ్యక్షులు కటారి శంకర్, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రలోభాలకు లోనుకాకుండా

# ఓటు హక్కు వినియోగించుకోవాలి

- సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు
- పోలింగ్ కేంద్రాలకు అక్రిడేటెడ్ జర్నలిస్టుల అనుమతి
- జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ వెల్లడి

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యతని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ జిల్లా ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 13న జరగనున్న పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు తగ్గ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు వీలుగా ఓటర్లను ఆకర్షించేలా ఆదర్శ (మోడల్) పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేశామని, యువతకు 6, మహిళలకు 4, వికలాంగుల కోసం 2 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసిన వాటిలో ఒక్కో ప్రత్యేకత ఉండేలా తీర్చిదిద్దామన్నారు. వేసవి దష్ట్యా పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం షామియానాలు, ప్రధానంగా విద్యుత్ సౌకర్యం, వికలాంగులు, వద్ధులు సులువుగా కేంద్రంలోకి వెళ్లేందుకు ర్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు వారి కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, మాజీ సైనిక ఉద్యోగులతో క్యూ లైన్లు నిర్వహణ చేపట్టేలా చర్యలతో పాటు పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది ఇబ్బందులు పడకుండా మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, భోజన వసతి కల్పించేలా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పోలింగ్ తేదీకి 48 గంటల ముందు అనగా ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ప్రచారం ఆపేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు చేయటానికి గానీ లేదా సందేహాలను తెలుసుకొనుటకు ఒంగోలు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూములో ఏర్పాటుచేసిన 08592-288599 టెలిఫోన్ నెంబర్‌కు కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

**విధులలో 14 వేల మంది సిబ్బంది**

ఈ నెల 13న జరిగే పోలింగ్ సందర్భంగా జిల్లాలోని అన్నీ నియోజక వర్గాలకు మొత్తం 14 వేల మంది ఎన్నికల పోలింగ్ సిబ్బందిని కేటాయించామన్నారు. వీరు జిల్లాలోని వివిధ బస్‌స్టేషన్‌ల నుండి సంబంధిత అసెంబ్లీ నియోజక వర్గాలకు ఎన్నికల విధులు నిర్వహించటానికి వెళ్ళు సిబ్బంది కోసం ఏపిఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందన్నారు. ప్రత్యేక బస్సులన్నీ ఆయా బస్ స్టేషన్ల నుండి ఉదయం 5 గంటల నుండి బయలుదేరుతాయని కలెక్టర్ తెలిపారు.

**కేంద్ర బలగాలతో బందోబస్తు**

జిల్లాలో 2183 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, వాటిలో 259 ప్రాంతాలలో 486 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక కేంద్ర బలగాలు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన వివరించారు.

**అక్రిడేటెడ్ జర్నలిస్టులకు అనుమతి**

ఎన్నికల కవరేజీ కోసం వెళ్లే అక్రిడేషన్ కార్డులు కలిగిన పాత్రికేయులను ఆయా పోలింగ్ కేంద్రాలలోని ఓటర్ల క్యూ లైన్ల ఫోటోలు, వీడియోలు తీసుకోడానికి 100 మీటర్ల దూరం లోపలికి కూడా అనుమతిస్తామని కలెక్టర్ స్పష్టం చేవారు.ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రత్యేక గుర్తింపు కార్డులు ఉంటే పోలింగ్ గది తలుపు వరకు అనుమతిస్తామని, రహస్య ఓటింగ్ విధానానికి భంగం కలగకుండా ఫోటోలు, వీడియోలు కూడా తీసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.